http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

శుక్రవారం 9 అక్టోబర్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5    వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది



- టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకే 'డిజిటల్ ఇండియా'
- డిజిటల్ ఇండియా అనేది టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జరిగిన ప్రయత్నమే
- ఇండియా మొబైల్ కాంగ్రెస్‌లో మోదీ ప్రసంగించారు.
- "డిజిటల్ అంతరం రూపంలో దేశం పెద్ద సవాలును ఎదుర్కొంటోంది
- గత 10-12 ఏళ్లుగా మొబైల్ ఫోన్ ఆధునిక సమాచార సాధనంగానే కాకుండా, సుపరిపాలనకు ఒక ముఖ్య సాధనంగా కూడా ఆవిర్భవించింది
- మొబైల్ ఫోన్ డిజిటల్ ఇండియా దార్శనికతకు కేంద్ర బిందువు

## ఓటమి భయంతోనే బీజేపీ కుట్ర

- ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ దేశాన్ని రెండు వర్గాలుగా విభజించారు
- ఓటమి భయంతో పేదల ఓట్లు తొలగించేందుకు బీజేపీ కుట్ర అంటూ రేవంత్ ఫైర్
- ఢిల్లీలో ఇండియా కూటమి నిరసనలో పాల్గొన్న సీఎం రేవంత్
- ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణకు బీజేపీ ప్లాన్ అంటూ ఆరోపణలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్
- ఓట్లు తీసేస్తే రేపు రిజర్వేషన్లు కూడా తీసేస్తారని హెచ్చరిక
- గల్లీ నుంచి దిల్లీ వరకూ పోరాటం
- ఎలక్షన్ కమిషన్‌ను సైమన్ కమిషన్‌లా ఉపయోగించేందుకు మోదీ ప్రయత్నం



హైదరాబాద్

ఓటమి భయంతోనే బీజేపీ దేశంలోని పేదల ఓటు హక్కును హరించాలని కుట్ర చేస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. పేదలు, దళితులు, గిరిజనులు, ఓబీసీలు, మైనారిటీలు బీజేపీకి వ్యతిరేకంగా మారడంతో ఆ పార్టీ భయపడుతోందని, అందుకే వారి ఓట్లను దొంగిలించాలని చూస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి చేపట్టిన నిరసనలో రేవంత్ రెడ్డి వరుసగా రెండో రోజు పాల్గొన్నారు. గురువారం రాజ్‌ఘాట్ వద్ద లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇతర ఇండియా కూటమి నేతలతో కలిసి ఆయన ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా సీఎం కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో రేవంత్ రెడ్డి బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "మతం, కులం, ప్రాంతం, భాష పేరుతో భారతీయులను విభజించడానికి బీజేపీ ప్రయత్నించింది. ప్రతిపక్షాలను బలహీనపరిచేందుకు, సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగం చేసింది. ఇప్పుడు ఓటమి భాయమని తేలడంతో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు చోరీకి గురైన వారు అంటూ - మిగతా3లో

## నవంబరు 9న తుది జాబితా



- ఓటరు దరఖాస్తులు, తొలగింపుల గణాంకాల వెల్లడి
- ఫారం-7లపై ఎస్ఈవో క్లారిటీ
- హైదరాబాద్‌లో ఇటీవల భారీగా నకిలీ ఫారం-7లు లభ్యమవడం కలకలం
- తెలంగాణలో కొత్తగా ఓటు కోసం 4,88,417 మంది దరఖాస్తు
- ఓటు తొలగింపు కోసం 24,323 ఫారం-7లు అందాయి



## చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం

- సీఈసీ రాజీనామా చేయాల్సిందే'
- మోదీ, షాకు సద్బుద్ధి కలగాలని రాజ్‌ఘాట్ వద్ద ఇండీ నేతల ప్రార్థనలు
- రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించిన ఇండీ కూటమి నేతలు
- కన్నాట్‌ప్లేస్ నుంచి రాజ్‌ఘాట్‌కు ర్యాలీగా చేరుకున్న ఇండీ కూటమి నేతలు
- మోదీ, అమిత్ షాకు సద్బుద్ధి కలగాలని రాజ్‌ఘాట్ వద్ద నేతల ప్రార్థనలు



## సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నియామకాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్
- ఇద్దరు కమిషనర్ల నియామకం, 2023 చట్టంపైనా పిటిషన్‌లో అభ్యంతరం
- సెలక్షన్ కమిటీ నుంచి సీజేఐని తొలగించడాన్ని ప్రశ్నించిన పిటిషనర్
- సీఈసీ రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలు

## దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

- హైదరాబాద్‌లో ఇండీ కూటమి 'చలో లోక్‌భవన్' ఉద్రిక్తం
- మంత్రులను అరెస్ట్ చేసి పంజాగుట్ట పీఎస్‌కు తరలింపు
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగిస్తాం: మహేశ్ గౌడ్
- ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తున్నా కూడా పదవిలో కొనసాగడం సరికాదు
- తక్షణమే ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్



హైదరాబాద్

హైదరాబాద్‌లో 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన చలో లోక్ భవన్ ఉద్రిక్తంగా మారింది. నెక్లెస్ రోడ్ నుంచి లోక్ భవన్ వరకు భారీ ప్రదర్శనగా ఇండీ కూటమి ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, వామపక్ష పార్టీ నేతలు ఈ ప్రదర్శనలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా 'సేవ్ డెమోక్రసీ' పేరుతో ఇండీ కూటమి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు - మిగతా3లో




## జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

- 14 మంది అన్నదాతలపై ఎఫ్ఐఆర్
- జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ నుంచి బలవంతంగా నీటిని విడుదల చేసిన రైతులపై కేసు
- ప్రాజెక్టు డీఈఈ ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ దాఖలైంది

హైదరాబాద్

జూరాల ఎడమగట్టు కాలువ నుంచి నీటిని విడుదల చేసుకున్న రైతులపై అమరచింత పోలీసులు కేసు నమోదు చేశారు. జూరాల ప్రాజెక్టు అధికారుల ఫిర్యాదుతో 14 మంది రైతులపై ఎఫ్?ఐఆర్ దాఖలు చేశారు. పంటలు ఎండుతున్నందున కాలువలకు నీటిని విడుదల చేయాలంటూ గత నెలలో స్థానిక గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. - మిగతా3లో



## సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు

- జస్టిస్ దీపాంకర్ దత్తా
- దేశంలో పెరిగిపోతున్న నేరాల గురించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- గతంలో హత్య కేసుల్లో శిక్షలు 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' సిద్ధాంతం ఆధారంగా ఉండేది
- 'క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి

## వచ్చేది మరో ఎండాకాలమే!

- రాష్ట్రంలో రానున్న రోజుల వాతావరణంపై ఐఎండీ అలర్ట్
- ప్రస్తుతం రాష్ట్రంలో వేసవిని తలపించేలా ఎండలు
- తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమిస్తాయి
- రానున్న 2 నెలల్లో ఎల్‌నినో ప్రభావం తీవ్రం
- వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు



# దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది



‘డిజిటల్ ఇండియా’ కార్యక్రమం టెక్నాలజీని అందరికీ అందుబాటులోకి తెచ్చే దిశగా జరిగిన ఒక ప్రధాన ప్రయత్నంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. సాంకేతికత అనేది డిజిటల్ అంతరాన్ని తగ్గించి, కేవలం వనరులు ఉన్న కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని ప్రతీ ఒక్కరికీ అందాలనేదే తమ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పరివర్తనలో మొబైల్ ఫోన్‌ను కేంద్ర బిందువుగా మార్చడం ద్వారా సాధారణ పౌరులకు కూడా అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని అన్నారు. దేశ రాజధాని దిల్లీలోని యశోభూమిలో జరిగిన పదో ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ)లో ఈ మేరకు ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

“డిజిటల్ అంతరం రూపంలో దేశం పెద్ద సవాలును ఎదుర్కొంటోంది. గత 10-12 ఏళ్లుగా మొబైల్ ఫోన్ ఆధునిక సమాచార సాధనంగానే కాకుండా, సుపరిపాలనకు ఒక ముఖ్య సాధనంగా కూడా ఆవిర్భవించింది. మొబైల్ ఫోన్ డిజిటల్ ఇండియా దార్శనికతకు కేంద్ర బిందువుగా నిలిచింది. సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం టెలికాం రంగంలో సంస్కరణలు చేపట్టింది. ఆ రంగంలో మౌలిక సదుపాయాలను విస్తరించింది. మొబైల్ ఫోన్లు, ఇతర టెలికాం హార్డ్‌వేర్‌లు దేశంలోనే తయారయ్యేలా చూడటంపై దృష్టి సారించింది. దేశంలోని ప్రతి జిల్లాకు 5జీ కనెక్టివిటీ చేరుకుంది. ప్రస్తుతం 5.5 లక్షలకు పైగా బేస్ స్టేషన్లు ఈ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నాయి. 2022తో పోలిస్తే మొబైల్ ఇంటర్నెట్ వేగం పది రెట్లు పెరిగింది. దేశం 5జీ-రీచ్‌అవుట్ భవిష్యత్తు వైపు పయనిస్తోంది. “

**‘మొబైల్ ఫోన్ సుపరిపాలనకు కీలకంగా మారింది’**

ప్రభుత్వ పథకాల పంపిణీలో మొబైల్ ఫోన్లు, డిజిటల్ కనెక్టివిటీ పోషిస్తున్న పాత్రను ప్రధాని మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డీబీటీ) ద్వారా రూ.50 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు బదిలీ అయ్యాయని అన్నారు. ఆ డబ్బు తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించడం ద్వారా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా చేశామని వివరించారు. వందలాది ప్రభుత్వ సేవలు ఇప్పుడు మొబైల్ ఫోన్లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ అవుతున్నాయని వెల్లడించారు.

“ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా లబ్ధిదారుల మొబైల్ ఫోన్లకు లింక్ అయిన బ్యాంకు ఖాతాలకు రూ. 50 లక్షల కోట్లు చేరాయి. తత్ఫలితంగా సుమారు రూ.5 లక్షల కోట్లు ఆదా అయ్యాయి. ఈ మొత్తం తప్పుడు చేతుల్లోకి వెళ్లకుండా నివారించాం. ఇలాంటి అవకతవకలను అరికట్టే ప్రయత్నాలను కొనసాగించడానికి నేను కట్టుబడి ఉన్నాను. పీఎం కిసాన్ కింద రూ. 4 లక్షల కోట్లను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేశాం. ఈ డబ్బు వారి ఖాతాలో జమ అయినప్పుడు రైతుల మొబైల్ ఫోన్‌లకు నోటిఫికేషన్ వస్తుంది. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను గతంలో పొందలేని కోట్లాది మంది చిన్న రైతులకు ఈ డబ్బు అందింది. మొబైల్ ఫోన్ ఇకపై కేవలం సమాచార మార్పిడి లేదా చాటింగ్ సాధనం మాత్రమే కాదు. ఇది పౌరులకు తక్కువ ప్రయాణం, తక్కువ నిరీక్షణ, తక్కువ ఖర్చు, ఎక్కువ సౌకర్యాన్ని కల్పించింది” అని మోదీ వ్యాఖ్యానించారు.

టెలికాం రంగంలో భారత్ సాధించిన ప్రగతిలో ఇండియా మొబైల్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించిందని మోదీ అన్నారు. గత కొన్నేళ్లుగా ఈ వేదిక దేశ ప్రగతిని, దాని ఆకాంక్షలను ప్రతిబింబించే ఒక వేదికగా ఆవిర్భవించిందని అభిప్రాయపడ్డారు. గత దశాబ్ద కాలంలో దేశ టెలికాం మౌలిక సదుపాయాల విస్తరణను కూడా ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. ఇందులో భాగంగా మారుమూల ప్రాంతాలలో సెల్ టవర్ల ఏర్పాటు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ల విస్తరణ, డేటా మరింత అందుబాటులోకి రావడం వంటి అంశాలను వివరించారు.

**ఆ మోసాలపై వరల్డ్‌వైడ్ ఫ్రేమ్‌వర్క్ ఉండాలి : మోదీ**

సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, డిజిటల్ నేరాలను ఎదుర్కోవడానికి ప్రపంచవ్యాప్త చట్రం (ఫ్రేమ్‌వర్క్) కావాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. డిజిటల్ మోసాలు దేశ సరిహద్దులను దాటాయని, అందుకే సంబంధిత వర్గాలన్నీ సమన్వయంతో పనిచేయాలని కోరారు. డిజిటల్ మోసాలను అరికట్టడానికి ప్రభుత్వాలు, టెక్నాలజీ కంపెనీలు, టెలికాం ఆపరేటర్లు, ఆర్థిక సంస్థలు యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల నమ్మకాన్ని పొందినప్పుడే టెక్నాలజీ విస్తృత స్థాయికి చేరుకోగలదని అభిప్రాయపడ్డారు.

**ఐఎంసీపై సింధియా ప్రశంసలు**

భారత్‌కు ప్రపంచ సాంకేతిక ఆశయాలను ముందుకు నడిపించడానికి అవసరమైన మానవ వనరులు (మ్యాన్‌పవర్, చలనశీలత(మొబిలిటీ), దృక్పథం(మైండ్‌సెట్) ఉన్నాయని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా అభిప్రాయపడ్డారు. ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసీ) దేశ సాంకేతిక సామర్థ్యాలను ప్రపంచానికి ప్రదర్శించే వేదికగా పరిణామం చెందాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకే డేటా అందిస్తున్న దేశాల్లో భారత్ ఒకటిగా ఉందని అన్నారు. బ్రాడ్‌బ్యాండ్ చందాదారుల సంఖ్య దశాబ్దం క్రితం కేవలం 6 కోట్లు ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య 110 కోట్లు దాటిందని చెప్పారు.

# చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం



స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతిపిత మహాత్మా గాంధీ ఆశీస్సులతో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కాంగ్రెస్ ఎంపీలు స్పష్టం చేశారు. జజుజ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన ఆగదని తేల్చి చెప్పారు. లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో కలిసి దాదాపు 300 మంది ఉభయ సభల ఎంపీలు బస్సులో రాజ్ ఘాట్‌కు వెళ్లారు. జాతిపిత మహాత్మా గాంధీ స్మారకం వద్ద ఒక్కొక్కరుగా నివాళు లర్పించారు. దిల్లీలో శుక్రవారం పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్టు తెలిపారు.

అంతకుముందు మాట్లాడిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఓట్ల దొంగతనం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, యువత సమస్యలన్నీ ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని చెప్పారు. జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మా గాంధీ, వల్లభ్ భాయ్ పటేల్ వంటి మహానాయకులు సాధించి పెట్టిన స్వేచ్ఛను, ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం లాక్కుంటోందని ఆరోపించారు. లోక్?సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తమను రెండు రోజులుగా నిరసన తెలపకుండా అడ్డుకున్నారని, మొదటి రోజు ఎన్నికల సంఘం వద్ద, బుధవారం జంతర్ మంతర్ వద్ద అడ్డుకుని దాడులు చేశారని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రహోంమంత్రి అమిత్ షా, జజుజ జ్ఞానేష్ కుమార్, మోహన్ భగవత్ లు నేరపూరిత కుట్ర ద్వారా రాజ్యాంగాన్ని నాశనం చేస్తున్నారని రాహుల్ ఆరోపించారు. ఓట్లను దొంగిలించి దేశాన్ని హైజాక్ చేశారని, త్వరలోనే ఆ నలుగురిని చట్టం ముందుకు తెస్తామన్నారు.

“రాజ్యసభ, లోక్‌సభలకు చెందిన సుమారు 300 మంది ఎంపీలు శాంతియుతంగా నిరసన తెలపాలని భావిస్తున్నారు. రెండు రోజులుగా మమ్మల్ని నిరసన చేయనివ్వకుండా అడ్డుకుంటున్నారు. మొదటి రోజు, మమ్మల్ని ఎన్నికల సంఘం కార్యాలయం బయట అడ్డుకున్నారు. ఆ తర్వాత, జంతర్ మంతర్ వద్ద నిరసన తెలపాలని మేము భావించాము. బుధవారం మీరు చూసినట్లుగా, మమ్మల్ని అక్కడ కూడా అడ్డుకున్నారు. మా వాళ్లపై దాడులు చేశారు. మా వాళ్లను కొట్టారు. వాళ్లకు శిక్ష పడుతుంది. ఇది మా హామీ. వాస్తవం ఏమిటంటే నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్, మోహన్ భగవత్?లు ఒక నేరపూరిత కుట్ర ద్వారా దేశాన్ని హైజాక్ చేశారు. రాజ్యాంగాన్ని నాశనం చేశారు. ఓట్లను దొంగిలించారు. దీనిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని ప్రతిపక్షంగా మేము హామీ ఇస్తున్నాం. వారిని న్యాయస్థానం ముందు నిలబెడతాం. ఈ నలుగురిని చట్టం ముందు నిలబడటాన్ని మీరు చూస్తారు.”

**రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ అపాయింట్‌మెంట్ కోరిన ఇండీ కూటమి**

ప్రతిపక్ష ఎంపీలు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలవనున్నారు. అందుకోసం అపాయింట్‌మెంట్ తీసుకున్నారు. ఆ సమయంలో ఎన్నికల సంఘంపై వస్తోన్న ఆరోపణలకు సంబంధించి వినతి పత్రం సమర్పించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు బంగాల్ మాజీ ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇప్పటికే దిల్లీకి చేరుకున్నారు.

**‘చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతాం’**

ఇదిలా ఉండగా, సీఈసీకి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టిన ఇండీ కూటమి ఎంపీలు పట్ల దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై మధ్యప్రదేశ్ కాంగ్రెస్ గురువారం భోపాల్‌లో ఆందోళన నిర్వహించింది. వ్యాపమ్ స్క్వేర్ నుంచి బోర్డ్ ఆఫీస్ స్క్వేర్ వరకు కాంగ్రెస్ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. “ఓటును కాపాడండి, దేశాన్ని కాపాడండి” అనే నినాదంతో భోపాల్ నగర జిల్లా కాంగ్రెస్ కమిటీ నిర్వహించిన ఈ నిరసనలో సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సహా పలువురు పాల్గొన్నారు. ఓటు హక్కును కాపాడుకునేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో తమ చివరి రక్తపు బొట్టు వరకు పోరాడుతామని తెలిపారు.

# రియాద్‌పై హూతీల దాడులు
# విమాన సర్వీసులు రద్దు చేసిన భారత్

సౌదీ అరేబియాలో పరిస్థితులు ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారాయి. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఆభా అంతర్జాతీయ విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని హూతీ రెబల్స్ దాడులకు పాల్పడటంతో విమాన రాకపోకలపై ప్రభావం పడింది. భద్రతా కారణాలతో భారత్‌కు చెందిన పలు విమానయాన సంస్థలు రియాద్ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ రియాద్‌కు వెళ్లే, అక్కడి నుంచి వచ్చే విమానాలను అక్టోబర్ 10 వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించాయి. ప్రస్తుత పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని, ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని సంస్థలు తెలిపాయి. రద్దైన టికెట్లకు పూర్తి రిఫండ్ లేదా ఉచితంగా మరో తేదీకి మార్చుకునే అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించాయి. గురువారం దిల్లీ నుంచి రియాద్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కూడా పరిస్థితుల నేపథ్యంలో తిరిగి దిల్లీకి వచ్చేసింది. అనంతరం ఆ విమానాన్ని రద్దు చేశారు. ప్రయాణికులకు పూర్తి రిఫండ్ అందిస్తామని ఎయిరిండియా తెలిపింది. కోచి నుంచి రియాద్‌కు వెళ్లాల్సిన రెండు విమానాలు కూడా రద్దయ్యాయి. కోచి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం రాత్రి బయల్దేరాల్సిన అకాసా ఎయిర్ ఞూ523, సౌదియా ాఎ775 విమానాలను రద్దు చేశారు. ఈ విమానాల్లో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు సంబంధిత విమానయాన సంస్థల కస్టమర్ కేర్‌ను సంప్రదించి తదుపరి ప్రయాణ ఏర్పాట్ల గురించి తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు. రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఆభా విమానాశ్రయంపై అక్టోబర్ 6, 7 తేదీల్లో దాడులు జరిగినట్లు సౌదీ అధికారులు తెలిపారు. ఈ ఘటనల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, 36 మంది గాయపడ్డారు. ఆభా విమానాశ్రయంలో ఇద్దరు మృతి చెందగా, 28 మంది గాయపడ్డారు. కింగ్ ఖలీద్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒకరు మరణించగా, ఎనిమిది మంది గాయపడ్డారు. ఆ దాడులకు యెమెన్‌లోని హూతీ మిలీషియా బాధ్యత వహించినట్లు సమాచారం. రియాద్ వైపు ప్రయోగించిన రెండు బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు తెలిపాయి. ఖమీస్ ముషైత్ వైపు వచ్చిన మరో క్షిపణిని కూడా అడ్డుకున్నట్లు వెల్లడించాయి. క్షిపణులను అడ్డుకునే సమయంలో కిందపడిన శకలాల కారణంగా రియాద్‌లోని ఓ కిండర్‌గార్టెన్, ఓ వైద్య కేంద్ర భవన సముదాయానికి నష్టం వాటిల్లినట్లు సౌదీ పౌర రక్షణ విభాగం తెలిపింది. దాడులకు ప్రతిస్పందనగా సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు యెమెన్‌లో హూతీలకు చెందిన 82 సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించాయి. సౌదీలోని పౌరులు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్న దాడులను సహించబోమని సంకీర్ణ దళాల ప్రతినిధి హెచ్చరించారు. ఇక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం పూర్తిగా ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సానుభూతి తెలిపిన భారత్.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించింది. సౌదీ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా ఉంటుందని పేర్కొంది.

**భారతీయులకు సూచనలు**

మరోవైపు సౌదీలోని భారతీయులకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు ఇళ్లలోనే ఉండాలని సూచించింది. స్థానిక అధికారులు అధికారికంగా జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరింది. దాడులకు సంబంధించిన వీడియోలు, వార్తలను ధృవీకరణ లేకుండా ఫార్వర్డ్ చేయడం లేదా సోషల్ మీడియాలో మళ్లీ పోస్టు చేయవద్దని హెచ్చరించింది. రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం, జెడ్డాలోని కాన్సులేట్ సాధారణంగానే పనిచేస్తున్నాయని తెలిపింది.

## సీఈసీ, కమిషనర్ల నియామకాలు రద్దు చేయాలి.. సుప్రీంకోర్టులో పిటిషన్



దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ నియామకానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనతో పాటు మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకాలను సవాలు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి నియామకాలను రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకం ప్రక్రియకు సంబంధించి తీసుకువచ్చిన 2023 చట్టాన్ని సైతం ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ముఖ్యంగా కమిషనర్లను ఎంపిక చేసే కమిటీ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగించడాన్ని పిటిషనర్ తీవ్రంగా తప్పుబట్టారు. మరోవైపు, ‘సర్’ ప్రక్రియను రద్దు చేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ పాల్గొన్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా ఒక్కటే తమ అంతిమ లక్ష్యం కాదని, ఆయన స్థానంలో మరొకరు వచ్చినా మార్పు ఉండదని, అందుకే ఆ వివాదాస్పద ప్రక్రియనే పూర్తిగా రద్దు చేయాలని నిరసనకారులు స్పష్టం చేశారు. ఎన్నికల వ్యవస్థలో సమూల ప్రక్షాళన జరగాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి సీజేపీ, వివిధ విద్యార్థి సంఘాలు సుదీర్ఘ పోరాటాలకు పిలుపునిచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఢిల్లీ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా భారీగా పోలీసు, భద్రతా బలగాలను మోహరించేందుకు సిద్ధమవుతోంది.

## సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు



మరణశిక్షలను జీవిత ఖైదుగా మార్చే విషయంలో సుప్రీంకోర్టు క్షమా గుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయని, దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాలని దేశ అత్యున్నత న్యాయస్థానం జడ్జి జస్టిస్ దీపాంకర్ దత్తా వ్యాఖ్యానించారు. గతంలో హత్య కేసుల్లో శిక్షలు ‘అరుదైన వాటిలో అత్యంత అరుదైన’ సిద్ధాంతం ఆధారంగా ఉండేవని అన్నారు. ఎందుకంటే ఆ రోజుల్లో హత్యలు చాలా అరుదుగా జరిగేవని, కానీ ప్రస్తుత రోజుల్లో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మర్డర్ కేసులో మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చుకున్న ఒక ఖైదీని ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ వ్యాఖ్యలు చేశారు.

**‘క్షమా గుణానికి ఎక్కడో ఒక చోట ఎండ్ కార్డ్ పడాలి’**

‘సుప్రీంకోర్టు క్షమాగుణం వల్లే దేశంలో నేరాలు పెరుగుతున్నాయి. దీనికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిన అవసరం ఉంది. ఒక తండ్రి తన సొంత పెద్ద కుమార్తెపై అత్యాచారం చేసి, ఆమెను హత్య చేశాడు. ఆ కేసులో అతడి భార్య ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా నిందితుడికి జీవిత ఖైదు పడింది. కొన్నేళ్ల తర్వాత ఆ నిందితుడు పెరోల్‌పై బయటకు వచ్చి తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పినందుకు పగతో భార్యను (చిన్న కూతురి కళ్ల ముందే) దారుణంగా హత్య చేశాడు. చిన్న కుమార్తె ఇచ్చిన సాక్ష్యం ఆధారంగా అతడికి కోర్టు మరణశిక్ష విధించింది. అయితే, ఆ నిందితుడు చిన్న కూతురిని చంపలేదనే కారణంతో సుప్రీంకోర్టు అతడి మరణశిక్షను కాస్త మళ్లీ జీవిత ఖైదుగా తగ్గించింది. అందుకే సుప్రీంకోర్టు క్షమించే గుణానికి ఎక్కడో ఒకచోట ముగింపు పలకాల్సిందే’ అని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా పేర్కొన్నారు.

**విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్?ను పెంచాలి : సుప్రీంకోర్టు**

మరోవైపు, దిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఇటీవల కాలంలో జరిగిన అత్యాచార ఘటనలపై సుమోటోగా విచారిస్తున్న సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశ రాజధాని దిల్లీలో నేరాలను గుర్తించడం, నివారించే అవసరాన్ని వివరించింది. ముఖ్యంగా విద్యాసంస్థల పరిసరాల్లో బీట్ పెట్రోలింగ్‌ను పెంచాలని దిల్లీ పోలీసులు, రవాణా శాఖ, స్థానిక పరిపాలన యంత్రాంగానికి ఆదేశించింది. అలాగే ప్రజా రవాణా వాహనాల డ్రైవర్లు, సహాయకులను కఠినంగా తనిఖీ చేయాలని సూచించింది. అవసరమైన అనుమతులు లేకుండా పనిచేస్తున్న అనధికార మద్యం దుకాణాలు, సంస్థలను గుర్తించి చట్ట ప్రకారం వాటిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసు విచారణను నవంబర్ 16కు వాయిదా వేసింది.

**‘గుండాల గుండెల్లో వణుకు పుట్టాలి’**

కాగా, ఈ కేసు విచారణ సందర్భంగా మహిళలపై నేరాలకు సంబంధించి ఇటీవలే దేశ అత్యున్నత న్యాయస్థానం ఘాటు వ్యాఖ్యలు చేసింది. నేరాలకు పాల్పడే గూండాల మనసుల్లో భయం సృష్టించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ముఖ్యంగా దిల్లీలోని కొన్ని సున్నితమైన ప్రాంతాల్లో మహిళలకు భద్రత లేదనే భావన ఉందని పేర్కొంది. దిల్లీలో అసాంఘిక శక్తులు లైంగిక నేరాలకు పాల్పడకుండా నిరోధించడానికి కఠినమైన చర్యలు, మరింత పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని దిల్లీ పోలీసులను కోరింది. మహిళలు, బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే సామాజిక వ్యతిరేక శక్తులను నిరోధించడానికి దిల్లీలో మరింత కఠినమైన, పటిష్టమైన పోలీస్ వ్యూహం అవసరమని స్పష్టం చేసింది. దేశ రాజధాని నగరమైన దిల్లీలో నేరాలను అరికట్టడం అత్యవసరమని చెప్పింది. క్షేత్రస్థాయిలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని, నేరాలకు పాల్పడటానికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భావన నేరస్థుల్లో కలిగించాలని సూచించింది.

# జూరాల కాలువకు నీరొదిలిన రైతులపై కేసు

-మొదటిపేజీ తరువాయి

అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో సెప్టెంబర్ 19న ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్? ధ్వంసం చేసి బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడంతో పాటు అధికారుల విధులకు ఆటంకం కలిగించారంటూ ప్రాజెక్ట్? నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సమీవుల్లా అమరచింత ఠాణాలో ఫిర్యాదు చేశారు.




**కారకులపై చర్యలు తీసుకోవాలి**

ఆరేపల్లి, మూలమల్ల, క్యాతెపల్లి తదితర గ్రామాల రైతులు భారీగా గుమిగూడి జూరాల ఎడమ కాలువ హెడ్ రెగ్యులేటర్ యాక్సెస్ డోర్లు, సెక్యూరిటీ ఫాస్టెనింగ్‌లు సైతం పగులగొట్టినట్లు డీఈఈ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కంట్రోల్ యూనిట్‌లోకి అనుమతి లేకుండా చొరబడి లెఫ్ట్ కెనాల్ గేట్లను బలవంతంగా ఎత్తి, నీటిని విడుదల చేయడంతో దాని స్క్రూరాడ్లు వంగిపోయినట్లు తెలిపారు. ప్రజా ఆస్తులను ధ్వంసం చేసినందుకు కారకులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఈ తన ఫిర్యాదులో వెల్లడించారు. ఈ మేరకు ప్రాపర్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు అమరచింత ఎస్సై పార్వతి తెలిపారు. అలాగే జూరాల ప్రాజెక్టు నుంచి నీరు వదలాలంటూ సెప్టెంబర్ 21న నిరసన చేపట్టిన బీఆర్?ఎస్, బీజేపీ నేతల పైన కూడా కేసులు నమోదయ్యాయి.

**రైతులపై కేసులు పెట్టడం పరిపాటిగా మారింది**

రైతులపై కేసులు నమోదు చేయడాన్ని బీఆర్?ఎస్? నేత హరీశ్?రావు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్? ఖాతాలో పోస్ట్? చేశారు. కాంగ్రెస్? పాలనలో అన్నదాతల చేతులకు బేడీలు వేయడం, కేసులు పెట్టడం పరిపాటిగా మారడం సిగ్గుచేటని విమర్శించారు. ఇలా కేసులు పెట్టించడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. అధికార నేతల చేతగానితనం వల్లే ఈరోజు రాష్ట్రంలో పంటలకు నీళ్లు అందక ఎండిపోతున్న దుస్థితి నెలకొందని ఆయన ఆరోపించారు.

**తప్పు ప్రభుత్వానిదైతే, శిక్ష రైతులకా?**

కడుపు మండిన రైతన్న రోడ్డెక్కి నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తారా? అంటూ హరీశ్?రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలీసులను ప్రయోగించి భయభ్రాంతులకు గురి చేయడం పాలకుల దుర్మార్గం, అన్యాయం అంటూ ధ్వజమెత్తారు. కృష్ణా నదిలో నీటి ప్రవాహాలు ఉన్నప్పుడు నీటిని లిఫ్ట్ చేయకుండా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించిందని ఆరోపణలు చేశారు. నీళ్లను ఒడిసి పట్టకుండా రాష్ట్రానికి జల ద్రోహం చేసిందన్నారు. తప్పు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే, శిక్ష రైతులు అనుభవించాలా అని నిలదీశారు.

**కేసులు వాపస్ తీసుకోవాలి**

రాష్ట్రవ్యాప్తంగా సాగునీరు, కరెంట్ లేక రైతులు ఆందోళనలు చేస్తుంటే పరిష్కరించాల్సింది పోయి అక్రమ కేసులు పెడతారా అంటూ పాలక నేతలపై హరీశ్?రావు మండిపడ్డారు. ఇది ప్రజా పాలనా? లేక ప్రజా పీడనా అంటూ దుయ్యబట్టారు. రైతులపై పెట్టిన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. రైతు వ్యతిరేక చర్యలు ఇలాగే కొనసాగిస్తే, పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హరీశ్?రావు హెచ్చరించారు.

# నవంబరు 9న తుది జాబితా

**హైదరాబాద్:** తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా ఓటు కోసం 4,88,417 మంది, ఎన్ఆర్ఐలు 6వేల మంది దరఖాస్తు చేసుకున్నారని సీఈవో కార్యాలయం తెలిపింది. చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం 5,04,782 దరఖాస్తు చేసుకున్నారని ప్రకటించింది. ఓటు తొలగింపు కోసం 24,323 ఫారం-7లు అందాయని పేర్కొంది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు నిన్నటితో ముగిసింది. నవంబరు 5 వరకు దరఖాస్తులను పరిష్కరించి.. నవంబరు 9న తుది జాబితాలో ప్రచురిస్తారు.

హైదరాబాద్ జిల్లాలో ఓటు తొలగింపు కోసం 6,335 ఫామ్-7లు వచ్చినట్లు సీఈవో కార్యాలయం ప్రకటించింది. నగరంలో భారీగా బోగస్ ఫామ్‌లు దరఖాస్తు చేశారని కొన్ని రోజులుగా రాజకీయ వివాదం కొనసాగుతోంది. వివాదం నెలకొన్న ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫామ్-7లు రాగా... అందులో 87 తొలగించినట్లు సీఈవో కార్యాలయం తెలిపింది. గోషామహల్‌లో 222 దరఖాస్తులు రాగా 87 తొలగించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి 6,335 ఫామ్-7లు అందగా.. ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు కొత్తగా ఓటు నమోదు కోసం రాష్ట్రంలో అత్యధిక ఫామ్-6లు హైదరాబాద్ జిల్లాలోనే వచ్చినట్లు సీఈవో కార్యాలయం వెల్లడించింది.

ఇటీవల హైదరాబాద్ జిల్లాలో ఓటు తొలగింపు కోసం అందించే ఫారం-7ల బోగస్ పత్రాల కట్టలు లభ్యమవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపింది. అయితే ఇవాళ రాష్ట్ర ఎన్నికల కార్యాలయం (ఎస్?ఈవో) రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఫారం-7లపై స్పష్టతనిచ్చింది. ఇందులో భాగంగా హైదరాబాద్ జిల్లా పరిధిలోని 15 నియోజకవర్గాల నుంచి 6,335 ఫారం-7లు వచ్చినట్లు ఎస్ఈవో ప్రకటించింది. ముషీరాబాద్ నియోజకవర్గంలో 151 ఫారం-7లుగా రాగా, అందులో 87 తొలగించినట్లు తెలిపింది. గోషామహల్‌లో 222 ఫారం-7లకు గానూ 87 తొలగించినట్లు ఎన్నికల కార్యాలయం స్పష్టం చేసింది.



**ఓటు కోసం 4,127 ఎన్ఆర్ఐల దరఖాస్తులు**

హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 6,335 ఫారం-7లు అందగా, ఇప్పటి వరకు 2,066 తొలగించారు. మరోవైపు రాష్ట్రంలో కొత్తగా ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన ఫారం-6లు అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచే వచ్చినట్లు ఎస్?ఈవో వెల్లడించింది. ఈ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో కొత్త ఓటు కోసం మొత్తంగా 1,93,135 దరఖాస్తులు రాగా, అందులో ఇప్పటి వరకు 29,226 అప్లికేషన్లను ఆమోదించింది. ఈ ప్రాంతం నుంచి 4,127 ఎన్ఆర్ఐలు కూడా కొత్త ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఎస్?ఈవో వెల్లడించింది. దీంతో పాటు? జిల్లా పరిధిలో అడ్రస్, ఇతర వివరాల మార్పు కోసం 1,44,495 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపింది.

**నవంబరు 9న తుది జాబితా**

ఇక రంగారెడ్డి జిల్లాలో 74,375 ఫారం-6లు, 2,223 ఫారం-7లు, 68,002 ఫారం-8లు అందాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్త ఓటు కోసం 64,167, ఎన్ఆర్ఐల నుంచి 561, ఓటు తొలగింపు కోసం 1,749, వివరాల మార్పు కోసం 65,376 అప్లికేషన్లు వచ్చినట్లు రాష్ట్ర ఎన్నికల కార్యాలయం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 4,88,417 ఫారం-6లు, ఎన్ఆర్ఐల నుంచి 6,270, ఓటు తొలగింపు కోసం 24,323 ఫారం-7లు, వివరాల మార్పు కోసం 5,04,782 ఫారం-8లు వచ్చినట్లు తెలిపింది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు బుధవారంతో ముగియగా, నవంబర్ 5 వరకు దరఖాస్తులను పరిష్కరించి నవంబరు 9న తుది జాబితాలో ప్రచురిస్తారు.

# వచ్చేది మరో ఎండాకాలమే!

రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. సాధారణం కన్నా 3 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో ఉక్కపోత వాతావరణం నెలకొని జనం అసౌకర్యానికి గురవుతున్నారు. రాబోయే రోజుల్లో వాతావరణ పరిస్థితులు ఈ విధంగానే కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. అలాగే తెలంగాణ నుంచి నైరుతి రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమైందన్నారు. ఇవాళ ఉత్తర, మధ్య తెలంగాణ నుంచి నిష్క్రమించిన నైరుతి రుతుపవనాలు, రేపటికల్లా పూర్తిస్థాయిలో తిరోగమనమవుతాయని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం బలమైన అల్పపీడనాలు ఉన్నప్పుడు తప్పిస్తే, మిగితా సమయాల్లో వర్షాలు కురవలేదు. ఎండలు, ఉక్కపోత పెరిగాయి. రానున్న 2 నెలల్లో ఎల్?నినో ప్రభావం మరింత తీవ్రంగా మారనుంది. ఇందులో భాగంగా ఇప్పటి నుంచే సాధారణం కన్నా 3 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం ఉంటుంది. అయితే ప్రస్తుతానికి ఉమ్మడి జిల్లాలైన ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్‌లో 35 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి సాధారణం కన్నా 4 డిగ్రీలు ఎక్కువ. సాధారణంగా నవంబర్, డిసెంబర్‌లో చలికాలం కారణంగా వాతావరణం చల్లబడుతుంది. అయితే ఈసారి ఎల్‌నినో వల్ల శీతాకాలంలోనూ సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగానే కొనసాగే అవకాశాలున్నాయి.




దీనివల్ల ఈ ఏడాది చలి తక్కువగానే ఉంటుంది. మరో రెండు నెలల దాకా ఎల్‌నినో ప్రభావం బలంగా ఉండనుందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు చెబుతున్నాయి. క్రమంగా 6 నెలల నుంచి ఎలా పెరుగుతూ వచ్చిందో, తగ్గడానికి కూడా అలాగే ఎక్కువ సమయం తీసుకునే అవకాశం ఉంది. సాధారణంగా రుతుపవనాల సమయాల్లో గాల్లో తేమ ఎక్కువగా ఉండటం వల్ల ఉక్కపోతగా అనిపిస్తుంది. దీనికి ఈసారి అధిక ఉష్ణోగ్రతలు తోడవ్వడంతో మరింత తీవ్రంగా మారి ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సెప్టెంబరు 19 నుంచే దేశంలో నైరుతి రుతుపవనాలు తిరుగుముఖం పట్టాయి. ముఖ్యంగా ఉత్తర రాష్ట్రాల నుంచి నిష్క్రమిస్తూ ఇవాళ మన రాష్ట్రంలో తిరోగమనం అవుతున్నట్లు తెలుస్తోంది. రానున్న 4 నుంచి 5 రోజుల వరకు ఎలాంటి వర్ష సూచన కనిపించడం లేదు. తేమ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సాయంత్రం వేళ మేఘావృత్తమై తేలిక పాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉంటుంది. ఇక నైరుతి రుతుపనాలు పూర్తి స్థాయిలో నిష్క్రమించిన తర్వాత ఈశాన్య రుతుపవనాలు ప్రవేశిస్తాయి. అయితే ఈ రుతుపనాల ద్వారా ప్రధానంగా తూర్పు కోస్తా ప్రాంతాల్లో తప్పితే మన రాష్ట్రంలో పెద్దగా వానలు పడే అవకాశం ఉండదు. ఒకవేళ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడి వర్షాలు కురిసే అవకాశం ఉన్నా, 7 రోజుల ముందే ప్రకటిస్తాం.

## ఓటమి భయంతోనే బీజేపీ కుట్ర



-మొదటిపేజీ తరువాయి

దేశాన్ని రెండు వర్గాలుగా విభజిస్తోంది" అని ఆయన పేర్కొన్నారు. సుమారు 13 కోట్ల మంది పౌరుల ఓట్లను తొలగిస్తే, అది ప్రపంచంలోనే అతిపెద్ద ఓటు హక్కు హరణ ప్రక్రియ అవుతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. "1952 నుంచి జరిగిన ప్రతి ఎన్నికలో ఓటర్ల సంఖ్య పెరిగింది. కానీ ఇప్పుడు, రాబోయే ఎన్నికల్లో దేశంలో మొత్తం ఓటర్ల సంఖ్య తగ్గే విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తున్నారు. అయితే, దీనికి భారత ప్రజలు అంగీకరించరు," అని ఆయన స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ లేదా ఇండియా కూటమిది మాత్రమే కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించినదని ఆయన అన్నారు. బ్రిటిష్ వారి 'విభజించు-పాలించు' ఎత్తుగడలతో ప్రధాని మోదీ అధికారంలోకి రావాలని చూస్తున్నారని ఆరోపించారు. "ఈ రోజు ప్రజల ఓట్లను చట్టవిరుద్ధంగా లాక్కుంటే, రేపు వారి రిజర్వేషన్లు, ప్రాథమిక హక్కులను కూడా లాక్కుంటారు. బీజేపీ వెంటనే సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, ప్రతి పౌరుడి ఓటు హక్కును పునరుద్ధరించాలి. లేదంటే ఆ పార్టీ భారత రాజకీయ చరిత్రలో చెత్తబుట్టలో కలిసిపోతుంది," అని రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

ప్రధాని నరేంద్ర మోదీ ఎలక్షన్ కమిషన్‌ను సైమన్ కమిషన్‌లాగా ఉపయోగించే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆనాడు భగత్ సింగ్ పోరాటం చేస్తే, ఈనాడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ పేద ప్రజల తరఫున ఉద్యమం చేస్తున్నారని కొనియాడారు. సర్? వివాదం నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో మూడు రోజులుగా దిల్లీ దద్దరిల్లుతోంది. గురువారం కూడా విపక్ష ఎంపీలు భారీ నిరసనలు చేపట్టారు. రాహుల్ గాంధీతో పాటు రేవంత్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

**అవేవీ చెల్లవని ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారు**

ఇది కాంగ్రెస్ సమస్య కాదని, దేశ ప్రజలు సమస్య అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ సమస్యకు కారణమైన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, నరేంద్ర మోదీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మతం, భాష, ప్రాంతాల పేరు మీద చిచ్చురేపి ఎన్నికల్లో నెగ్గడానికి ఇన్ని రోజులు ప్రయత్నం చేశారని విమర్శించారు. ఆ తర్వాత ఈడీ, సీబీఐ, కేంద్ర ప్రభుత్వం విచారణ సంస్థల చేత ఎన్నికల్లో గెలవడానికి ప్రయత్నం చేసిందని, ఇకపై రాబోయే ఎన్నికల్లో ఈ ప్రయోగాలు ఏవీ చెల్లవని, ఇప్పుడు ఈసీని ప్రయోగిస్తున్నారని సీఎం విమర్శించారు. "ఇది కాంగ్రెస్ సమస్య కాదు. దేశ ప్రజల సమస్య. ఈ సమస్యకు కారణమైన సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి. ప్రధాని నరేంద్ర మోదీ చర్యలు తీసుకోవాలి. గల్లీ నుంచి దిల్లీ వరకూ ప్రజలు నరేంద్ర మోదీకి వ్యతిరేఖంగా పోరాటం చేస్తున్నారు"

**గల్లీ నుంచి దిల్లీ వరకూ పోరాటం**

వచ్చే ఎన్నికల్లో గెలవడానికి ఎస్ఐఆర్?తో 13 కోట్ల ఓట్లు తొలగించడం ద్వారా కేంద్రంలో అధికారం చేపట్టాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని రేవంత్? రెడ్డి విమర్శించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను ఉపయోగించి పేద ప్రజల ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ దేశంలో 13 కోట్ల ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చి అత్యంత ప్రమాదకరమైన రాజకీయ ఎత్తుగడను ప్రధాని నరేంద్ర మోదీ ప్రయోగిస్తున్నారని అన్నారు. అందుకే గల్లీ నుంచి దిల్లీ వరకూ ప్రజలు నరేంద్ర మోదీకి వ్యతిరేఖంగా పోరాటం చేస్తున్నారని స్పష్టం చేశారు.

## దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

-మొదటిపేజీ తరువాయి




దారి తీసింది. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నుంచి లోక్ భవన్ వరకు కూటమి నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ప్రదర్శనలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అజారుద్దీన్, శ్రీధర్ బాబు, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తదితర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు.

**పంజాగుట్ట పీఎస్‌కు తరలింపు**

ఇండీ కూటమి ఆధ్వర్యంలో తలపెట్టిన ర్యాలీ లోక్‌భవన్ వద్దకు చేరుకునే సరికి భద్రతా కారణాల దృష్ట్యా పోలీసులు అప్రమత్తమయ్యారు. బారికేడ్లను ఏర్పాటు చేసి నేతలను ముందుకు వెళ్లకుండా నిలువరించారు. దీంతో పోలీసులకు, ఇండీ కూటమి నేతలకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో మంత్రులు పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, వేం నరేందర్ రెడ్డి లోక్ భవన్ ఎదుట నడిరోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో మంత్రులను అదుపులోకి తీసుకుని డీసీఎంలోకి ఎక్కించి పంజాగుట్ట పీఎస్‌కు తరలించారు.

"దేశవ్యాప్తంగా ఓటు హక్కును కాపాడుకోవడానికి ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. రాహుల్ గాంధీ చేస్తున్న నిరసనకు మాతో పాటు దేశంలోని ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. వెంటనే బీజేపీ స్పందించి ఓటు హక్కును కోల్పోకుండా తగిన చర్యలు తీసుకోవాలి. సీఈసీ జ్ఞానేశ్ కుమార్?తో రాజీనామా చేయించాలని డిమాండ్ చేస్తున్నాం" మంత్రుల అరెస్ట్‌తో లోక్‌భవన్ ప్రాంగణం మరింత ఉద్రిక్తంగా మారింది. రాజ్యాంగబద్ధమైన సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని, ప్రశ్నించే గొంతులను పోలీసులతో నొక్కేయాలని చూస్తోందని అరెస్ట్? అయిన నాయకులు ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆందోళనలు కొనసాగిస్తాం: మహేశ్ గౌడ్**

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వైఖరిని తప్పుబట్టారు. ఇంత పెద్ద ఎత్తున వ్యతిరేకత వస్తున్నా కూడా పదవిలో కొనసాగడం సరికాదన్నారు. తక్షణమే ఆయన స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా సవరణపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేసే పరిస్థితుల్లో కేంద్ర ఎన్నికల సంఘం లేదని ఆరోపించారు. ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని.. ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు పూర్తి విశ్వాసం కలిగేలా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. దిల్లీలో రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సహా ఇండియా కూటమి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటనను రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఖండించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ ఆందోళనలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## సంపాదకీయం

# ఈసీ వర్సెస్ సుప్రీం

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థనే ఇబ్బందుల్లోకి నెట్టారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై దేశంలో ప్రస్తుతం తీవ్రమైన రాజకీయ మరియు న్యాయపరమైన వివాదం నడుస్తోంది. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు, కొంతమంది పౌర సమాజ కార్యకర్తలు ఆరోపణలు గుప్పిస్తుండగా, కోర్టులలో కూడా పిటిషన్లు దాఖలయ్యాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ , సెంట్రలైజ్డ్ సాఫ్ట్‌వేర్ విధానాల వల్ల లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుండి తొలగించారంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎన్నికల సంఘం నిర్ణయాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, మిగిలిన కమిషనర్ల అభ్యంతరాలను పక్కనబెట్టారని కొందరు మాజీ బ్యూరోక్రాట్లు, కార్యకర్తలు ఆరోపిస్తూ ఆయనకు "పబ్లిక్ ఇంపీచ్‌మెంట్ నోటీస్" పంపేందుకు ప్రయత్నించారు. జ్ఞానేశ్ కుమార్ ను సీఈసీ పదవి నుంచి తక్షణమే సస్పెండ్ చేయాలంటూ దాఖలైన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. రాజ్యాంగబద్ధమైన అత్యున్నత సంస్థ చట్టానికి లోబడే పనిచేస్తుందని కోర్టు వ్యాఖ్యానించింది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. మరొకవైపు కేంద్ర ఎన్నికల సంఘం తమపై వస్తున్న అంతర్గత విభేదాల వార్తలను ఖండించింది. గత ఏడాది కాలంగా తీసుకున్న నిర్ణయాలన్నీ కమిషనర్లందరి సమ్మతితో ఏకగ్రీవంగానే జరిగాయని స్పష్టం చేసింది. అలాగే పారదర్శకతను పెంచేందుకు వీలుగా సమావేశాల అజెండాలను ముందే పంచుకోవడం, మినిట్స్ విడుదల చేయడం వంటి కొత్త మార్పులను కూడా ఈసీ ప్రకటించింభారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నాఎఖీ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల ఓటర్ల పేర్లను తొలగించడం, ఫారమ్-6 నిబంధనలలో మార్పులు చేయడం వంటి కీలక నిర్ణయాలను మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి లు వ్యతిరేకించినప్పటికీ, జ్ఞానేశ్ కుమార్ ఒంటెత్తు పోకడలతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దాదాపు 14 సార్లు సహచర కమిషనర్లు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెల్లడించాయి. ఫారం 6 వివాదం ముదురుతోంది. ఎన్నికల సంఘం (ఈసీ) నిర్ణయాలు ఏకపక్షంగా ఉంటే వాటిని రద్దు చేస్తామని తాజాగా సుప్రీం కోర్టు చేసిన హెచ్చరికలతో ఈసీ చిక్కుల్లో పడింది. ఫారం-6 సవరణలను తాము ఆమోదించలేదని, అవి చట్టవ్యతిరేకంగా ఉంటే రద్దు చేస్తామని నిన్న (సోమవారం) సర్వోన్నత న్యాయస్థానం హెచ్చరించిన విషయం తెలిసిందే. ఫారం-6ను కొత్త ఓటర్ల నమోదు కోసం వినియోగిస్తారు. అయితే దీనిలో ఏకపక్షంగా సవరణలు చేశారని దేశవ్యాప్తంగా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫారం 6లో.. గత ఎస్ఐఆర్‌లో తమ పేరు/ తల్లిదండ్రుల పేరు/ తాత, నానమ్మల పేరు ఉందా అన్న విషయం తెలపాలంటూ ఈసీ సాఫ్ట్‌వేర్‌లో మార్పు చేశారంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై సుప్రీం కోర్టు ఘాటుగా స్పందించింది. ఆ సవరణలను తాము ఆమోదించలేదని స్పష్టం చేసింది. మరోవైపు ఫారం-6 ఎలాంటి సవరణలూ చేయలేదని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. తాము అదనంగా ఒక డిక్లరేషన్‌ను సమర్పించాలని ఆదేశాలు జారీ చేశామని చెప్పింది. పైగా ఈ మార్పులను బిహార్ 'సర్'పై ఇచ్చిన మే నెల తీర్పులో సుప్రీం కోర్టు కూడా సమర్థించిందని తెలిపింది. కాగా.. ఈసీఐ అధికారిక పోర్టల్‌లో ఫారం-6కు దరఖాస్తు చేసుకోవాలంటే ఈ అదనపు డిక్లరేషన్ తప్పనిసరిగా జతచేయాలి. ఇందుకోసం ఆ పోర్టల్‌లో 'ఫిల్ ఫారం-6', 'ఫిల్ డిక్లరేషన్' అని రెండు ఆప్షన్లు ఉంటాయి. ఇప్పుడు దీనిపై వివాదం రాజుకోవడంతో డిక్లరేషన్ ఆప్షన్‌ను ఈసీ తొలగించింది. ఇప్పుడు దీన్ని కోర్టు తీవ్రంగా పరిగణించింది, ఎవరి ఆదేశాలతో ఆ పత్రాన్ని తప్పనిసరి చేశారని ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఈసీ పలు న్యాయపరమైన ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముంది. ఈ వ్యవహారం అధికార పక్షానికి లబ్ధి చేకూర్చేలా ఉందంటూ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సహా ఇండి కూటమి నేతలు ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం కొట్టిపారేసింది. ఒక బహుళ సభ్యుల కమిషన్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమని, అంతిమ నిర్ణయాలు ఏకాభిప్రాయంతోనే జరిగాయని వివరణ ఇచ్చింది. మరో వైపు ఏఐఎంఐఎం ప్రెసిడెంట్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఈ విషయంపై స్పందించారు. ఫామ్ 7 దరఖాస్తుల పేరుతో ఓట్లు తొలగించాలని చూస్తే పెద్దఎత్తున ఆందోళనలకు దిగుమతామని హెచ్చరించారు. ఫామ్ 7 పేరుతో తప్పుడు దరఖాస్తులు లేదా అప్పీళ్లు సమర్పిస్తే వారిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలి" అని కోరారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం కూడా స్పందించింది. "ఫామ్ 7 దరఖాస్తుల విషయంలో అనర్హమైనవి సమర్పిస్తే తగిన చర్యలు తీసుకోవాలి" అని తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ అధికారి (సీఈవో) సి. సుదర్శన్ రెడ్డి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. మరోవైపు, 'సర్' ప్రక్రియలో భాగంగా కర్ణాటకలో ఫామ్ 7 కింద దాదాపు నాలుగువేలకు పైగా ఓటర్ల పేర్లు తొలగించారని, వారిలో ఎక్కువ మంది ముస్లిం ఓటర్లు ఉన్నారంటూ ప్రచారం జరుగుతోంది. .మొత్తం మీద జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల వ్యవస్థను గబ్బు పట్టించారన్న ఆరోపణలయితే దేశ వ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో విపక్షాలు సక్సెస్ అయ్యాయి. జ్ఞానేశ్ కుమార్ మీ తాత, అమ్మమ్మల ఓటర్ల కార్డు ఐడీ నెంబరు చెబుతావా? అంటూ నెట్టింట కామెంట్స్ కూడా పెడుతున్నారు.

# పతకాలు చెప్పే పాఠం



నువ్వా నేనా అన్నట్టు తలపడే క్రీడోత్సవాల్లో కూడా యుద్ధంలో మాదిరే అవతలి పక్షంపై గెలిచి తీరాలన్న తపన, పట్టుదల ఉంటాయి. ఈర్ష్య, అహంకారం వంటివీ అప్పుడప్పుడు కనబడకపోవు. కానీ దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షుడు నెల్సన్ మండేలా చెప్పినట్టు ప్రపంచాన్ని మార్చే శక్తి, కోట్లాదిమందికి ప్రేరణగా నిలిచే సామర్థ్యం, ప్రపంచ పౌరుల్ని ఒక్కటిచేసే సత్తా క్రీడలకే ఉంటుంది. జపాన్‌లోని నగోయాలో రెండు వారాలు కొనసాగి, ఎన్నో అద్భుతాలు ప్రపంచానికందించిన ఆసియా క్రీడల సంరంభం ఆదివారం ముగిసింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా క్రీడాకారుల తర్వాత పతక విజేతల్లో మన ఆటగాళ్లది నాలుగో స్థానం. 2023నాటి చైనా క్రీడోత్సవాల్లోనూ మన స్థానం అదే గనుక ఫర్వాలేదన్న అభిప్రాయం కలుగుతుంది. కానీ సంఖ్యరీత్యా ఈసారి తీసికట్టే. గతంలో 28 స్వర్ణపతకాలు గెలుచుకున్న మన దేశం ఇప్పుడు 21కి సరిపెట్టుకోవాల్సివచ్చింది. వెండి పతకాల్లో చూస్తే 38 నుంచి 28కి పడిపోయాం. కాంస్యంలోనూ అంతే. గతంలో వాటి సంఖ్య 41 కాగా ఇప్పుడు 37. షూటింగ్, ఆర్చెరీ, అథ్లెటిక్స్ విభాగాల్లో అనుకున్న స్థాయిలో స్వర్ణాలు గెలుచుకోలేకపోవటం పెద్ద లోటు. మనం నాలుగో స్థానంలో ఉన్నామన్న మాటేగానీ తొలి ముగ్గురితో పోలిస్తే చాలా దూరంలో ఉన్నట్టు లెక్క. ఉదాహరణకు 341 పతకాలతో చైనా, 269తో జపాన్, 150తో దక్షిణ కొరియా ఉన్నాయి. గతంలో 107 పతకాలు గెల్చుకున్న మన జట్లు ఇప్పుడు 85కి పరిమితమయ్యాయి. మన క్రీడాకారుల ఎంపిక ఈసారి కొంత కఠినంగానే ఉంది. పతకాలు రాబట్టగలిగేవారినే ఎంపిక చేయాలన్న పట్టుదల కనబడింది. అందుకు నిర్దేశించిన గీటు రాళ్లు కూడా చిన్నవేం కాదు. గత క్రీడోత్సవాల్లో, ఆసియన్ చాంపియన్‌షిప్, అంతర్జాతీయంగా గుర్తింపుపొందిన ఇతర టోర్నీల్లో తొలి ఆరుస్థానాల్లో నిలిచినవారినే జపాన్ పంపాలన్నది అందులో ముఖ్యమైన ది. గతంలో 'సొంత ఖర్చులతో వస్తాం. అవకాశమీయండి' అని అడిగే క్రీడాకారులు... మన్నించిన అభ్యర్థనలూ తక్కువేం కాదు. ఈసారి కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ అలాంటివారికి ఎట్టి పరిస్థితుల్లోనూ చోటీయరాదన్న కృతనిశ్చయంతో ఉంది. మెరుగ్గా ఆడేవారికి మాత్రమే అవకాశం ఇవ్వాలన్న సంకల్పం మంచిదే. ఇందువల్ల వెళ్లిన క్రీడాకారుల సంఖ్య తగ్గింది. వారిలో ఎక్కువ శాతంమంది మెడల్ రౌండ్ వరకూ వెళ్లగలిగారు. ఎప్పట్లాగే ఇతర ఈవెంట్లతో పోలిస్తే మనకు అథ్లెటిక్స్‌లోనూ, షూటింగ్ లోనూ ఎక్కువ పతకాలొచ్చాయి. వాటిల్లో కూడా సంఖ్యా పరంగా తగ్గినట్టే. ఆసియా క్రీడోత్సవాలను ఒలింపిక్స్‌కు ముందస్తు పరీక్షలుగా భావిస్తారు. అక్కడ పనితీరునిబట్టే ఒలింపిక్స్‌లో జాతకం ఎలా ఉండబోతోందో చెప్పవచ్చంటారు. చైనా క్రీడోత్సవాలకూ, జపాన్ ఉత్సవాలకూ మధ్య మన దేశం దాదాపు రూ. 98 కోట్లు వ్యయం చేసింది. కానీ సాధించింది చాలా తక్కువే. మనకొచ్చిన స్వర్ణాల్లో కూడా అత్యధికం...అంటే 21లో 13 టీమ్ ఈవెంట్స్‌కు సంబంధించినవే. సమష్టిగా, సమన్వయంతో ఆడి గెల్చుకోవటం ప్రశంసించదగ్గదే అయినా, ఒలింపిక్స్‌లో ఈ ఈవెంట్స్‌కు చోటుండదు. ఆటగాళ్ల పనితీరు మెరుగుపడిందా లేదా అన్నది చూడాలి తప్ప, పతకాలను చూసి అంచనాకు రాకూడదన్న అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఆదెల్ సుమారీవాలాతో ఏకీభవించటం కొంత కష్టమే. సగం స్వర్ణాలు క్రికెట్, కబడ్డీ, హాకీ వగైరాలకే వచ్చాయి. ఇవన్నీ జట్టు సమష్టి బలాన్ని చాటాయి... నిజమే. కానీ వ్యక్తిగత ఈవెంట్లలో మరింత మెరుగ్గా ఉంటే ఒలింపిక్స్‌కు అది లాభిస్తుంది. అంతర్జాతీయ సందర్భాల కోసం కఠిన నిబంధనలతో క్రీడాకారుల ఎంపిక, శిక్షణ వగైరాలు మంచిదే. కానీ పాఠశాల స్థాయినుంచే ఈ రంగంలో అర్హులైనవారిని గుర్తించి, స్పోర్ట్స్ అథారిటీలు, అకాడెమీలద్వారా వారిని సానబడితేనే జాతీయ స్థాయిలో మెరికల్లాంటి క్రీడాకారులు రూపొందుతారు. మన బడుల్లో మంచినీరు, మరుగు దొడ్లువంటి మౌలిక సదుపాయాల కల్పనే అంతంతమాత్రం. అలాంటిచోట క్రీడలకు చోటిస్తారని ఆశించటం దురాశే. ఏదేమైనా ఇప్పుడు బయటపడిన లోటుపాట్లను నిశితంగా గమనించి సరిదిద్దుకుంటే 2028లో జరిగే లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్ నాటికి, 2030లో జరిగే దోహా ఆసియా క్రీడోత్సవాలనాటికి మన దేశం మరింత ఉన్నత స్థాయికెదుగుతుంది.

# ధాన్యం మాయలో దోషులు ఎవరు?



రాష్ట్రంలో రైస్‌మిల్లుల యజమానుల నిర్వాకం వల్ల ప్రభుత్వానికి చెందిన కోట్ల రూపాయల బియ్యాన్ని చీకటి బజారుకు పంపిన వైనం తెలిసి జనం నివ్వెరపోతున్నారు. 'భయం లేని కోడి బజార్ల గుడ్డు పెట్టినట్టు' ప్రభుత్వం, చట్టాల పట్ల ఏమాత్రం అదురూ బెదురు లేకుండా మిల్లర్లు రాష్ట్ర ఖజానాకు భారీగా తూట్లు పొడిచారు. ఈ వ్యవహారమంతా చూస్తే తప్పు రెండు వైపులా ఉందనిపిస్తున్నది. పంట దిగుబడి తర్వాత ప్రభుత్వం రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లుల్లో ఆడించి, వచ్చిన బియ్యాన్ని నెలవారీగా పేదలకు పంపిణీ చేస్తుంది. కస్టమ్ మిల్డ్ రైస్ విధానం ప్రకారం ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని రైస్‌మిల్లులు బియ్యంగా మార్చి ఇస్తాయి. అందుకుగాను వారికి క్వింటాలు లెక్కన మిల్లింగ్, రవాణా చార్జీలు ప్రభుత్వం చెల్లిస్తుంది. ధాన్యం అందిన 15 రోజుల్లో పౌరసరఫరాల శాఖకు బియ్యాన్ని అప్పగించవలసి బాధ్యత మిల్లులపై ఉంటుంది.

ఈ ఆగస్టులో సివిల్ సప్లయిస్ అధికారులు రైస్‌మిల్లుల తనిఖీలు చేపట్టగా దిమ్మతిరిగే వాస్తవాలు బయటపడ్డాయి. గత మూడేండ్లుగా ప్రభుత్వం అప్పగించిన ధాన్యంలో 2.7 లక్షల మెట్రిక్ టన్నుల దాకా లెక్కకు అందడం లేదని అధికారులు తేల్చారు. రైస్‌మిల్లుల్లో స్టాకుగా ఉండవలసిన సుమారు రూ.3,905 కోట్ల విలువైన బియ్యం గాయబ్ అయ్యాయి. ప్రభుత్వానికి అప్పగించవలసి బియ్యాన్ని మిల్లుల యజమానులు రాష్ట్రాన్ని దాటించి అధిక ధరలకు అమ్ముకున్నట్లు తెలుస్తున్నది. ఆ సొమ్ముతో వారు రియల్ ఎస్టేట్‌లో, సినిమా నిర్మాణాల్లో పెట్టుబడి పెట్టినట్టు, కొత్త రైస్‌మిల్లులు స్థాపించుకున్నట్లు విచారణలో తేలింది. పంపిణీకి సరిపడే బియ్యం మాత్రమే ఉన్నాయి, ఇప్పుడే మిల్లింగ్ చేయవద్దని చెప్పిన ఒకే మాటను సాకుగా తీసుకుని, అక్రమంగా ఆ సరుకును సరిహద్దులు దాటించారు.

రాష్ట్రంలోని రైస్‌మిల్లులు చాలావరకు ఈ నేరంలో భాగమయ్యాయి. తప్పు చేసిన చిన్నమిల్లుల యజమానులు తాము అమ్ముకున్న బియ్యం విలువను ప్రభుత్వానికి చెల్లించారు. మొత్తం రూ.3,905 కోట్లలో ఇంకా రూ.2,200 కోట్లు వసూలు కావలసి ఉన్నది. సివిల్ సప్లయిస్ చట్టాల ప్రకారం ఇలాంటి నేరాలకు పాల్పడితే వాస్తవ విలువకు తోడుగా 25 % జరిమానా విధిస్తారు. ఆ సొమ్ము చెల్లించకుంటే మిల్లును, దాని యజమాని ఆస్తులను జప్తు చేస్తారు. ఆ మిల్లును బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి భవిష్యత్తులో ధాన్యం కేటాయింపు చేయరు. ఈ క్రమంలో సివిల్ సప్లయిస్ అధికారులు పలు జిల్లాల్లోని రైస్‌మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేస్తున్నారు. సుమారు 360 మిల్లుల యజమానులు ప్రభుత్వ చర్యల నుంచి తమను రక్షించాలని కోర్టును ఆశ్రయించారు.

ప్రభుత్వ ఆకస్మిక తనిఖీలకు నిరసనగా తెలంగాణ రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు రాష్ట్రంలో గత నెల 12న మిల్లులు మూతపడ్డాయి. గత పదేండ్లుగా మిల్లింగ్ చార్జీలు చెల్లించని ప్రభుత్వం తమను దొంగల్లా చిత్రిస్తున్నదని వారు ఆరోపిస్తున్నారు. రైతుల పంటకు, ప్రజలకందే బియ్యానికి మధ్యవర్తిగా కీలక పాత్ర పోషిస్తున్న రైస్‌మిల్లులను కాపాడవలసిన అవసరం, బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. అందుకోసం తాము బకాయిపడిన సొమ్ముపై 12 % వడ్డీని, 25 % జరిమానాలు విధించవద్దని మిల్లర్లు కోరుతున్నారు. సీఎంఆర్ ఒప్పందం ప్రభుత్వానికి అనుకూలంగా ఏకపక్షంగా ఉన్నదని, దానికి సవరణలు అవసరమని వారు అంటున్నారు. ఒప్పందంలో పేర్కొన్నట్లు క్వింటాలు వడ్ల నుంచి 67 కిలోల బియ్యం రావడం లేదని, తడి వల్ల కొంత బియ్యం ముక్కిపోతున్నాయని, బరువు తగ్గుతున్నాయని, ఆ నష్టాన్ని తాము భరిస్తున్నామని చెప్తున్నారు. ఈ నష్టాలతో వేగలేక చాలా మిల్లులు అమ్ముకునే పరిస్థితి ఉన్నదని వారి వాదన. మూడేండ్లుగా సరియైన నిఘా కొరవడి, ప్రజా పంపిణీ వ్యవస్థపై పట్టు లేకుండా కాలం గడిపిన పౌరసరఫరాల మంత్రిత్వ శాఖ, అధికారులు ఇప్పుడే కండ్లు తెరిచినట్లు మిల్లుల మీద పడడానికి కారణమెవరు? దీని వెనుక స్వలాభాపేక్ష రాజకీయ కోణం ఉన్నదా? లేదా అధికారుల అవినీతి బాగోతమున్నదా? అనేది ముందు తేలాలి. బెదిరిపోయిన చిన్నచేపలు బకాయిలు చెల్లించగా ఇక మిగిలినవన్నీ పెద్ద చేపలే. రూ.90 కోట్ల బకాయి ఉన్న పెద్దమిల్లులు ఇప్పుడు సర్కార్‌తో బేరసారాలకు దిగాయి. ఈ మధ్య ఓ సమావేశంలో పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఈ విషయంపై మాట్లాడుతూ-డిఫాల్ట్ మిల్లులపై విధించిన వడ్డీ, జరిమానా తొలగింపు గురించి ప్రభుత్వంతో చర్చిస్తానని అన్నారు. గత మూడేండ్లుగా సాగుతున్న ఈ తతంగంపై ముందే పరిస్థితులు చేయి దాటిపోకుండా ప్రభుత్వం చూసుకోవాలి. చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరించి ఎలాంటి రాయితీలు ఇవ్వకుండా మొత్తం సొమ్ము ముక్కు పిండి వసూలు చేయాలి. అవన్నీ వదిలేసి మిల్లర్లకు అనుకూలంగా ప్రభుత్వం మొగ్గుచూపితే కోల్పోయిన కోట్లాది రూపాయల ప్రజాధనానికి బాధ్యత ఎవరు వహిస్తారు?

# బతుకమ్మ నిమజ్జనం... భక్తితో సాగాలి : ఎంపీడీవో సంకీర్త్

**అగ్నిధార న్యూస్: పినపాక ( భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)**

ప్రకృతిని, నీటి వనరులను ఆరాధించే పండుగ బతుకమ్మ. పినపాక మండల పరిధిలోని గోదావరి నది తీర ప్రాంతాలు, గ్రామాల్లోని చెరువులు కలుషితం కాకుండా సద్దుల బతుకమ్మ నిమజ్జన సమయంలో ప్రజలు పరిశుభ్రతా నియమాలను పాటించాలని ఎంపీడీవో సంకీర్త్ మండల ప్రజలను కోరారు. బతకమ్మ పండుగ మొదలవుతున్న నేపథ్యంలో బతుకమ్మలను గునుగు, తంగేడు, కట్ల, గుమ్మడి తదితర సహజసిద్ధమైన స్థానిక పూలతోనే పేర్చాలని, థర్మాకోల్, ప్లాస్టిక్ బేస్‌లు, కృత్రిమ రంగుల కాగితాలను ఉపయోగించకూడదని సూచించారు. గౌరమ్మ తయారీలో పసుపు లేదా సహజ మట్టిని మాత్రమే ఉపయోగించాలని, రసాయన రంగులతో కూడిన విగ్రహాలను నివారించాలని, సద్దులు, ప్రసాదాలను ప్లాస్టిక్ కవర్లలో కాకుండా స్టీల్ డబ్బాలు, విస్తరాకుల్లో తీసుకురావాలని అన్నారు.



బతుకమ్మను గోదావరిలో లేదా చెరువుల్లో నిమజ్జనం చేసే ముందు పూల కట్టలకు ఉపయోగించిన ప్లాస్టిక్ దారాలు, వైర్లు, పిన్నులు తదితరాలను తప్పనిసరిగా తొలగించాలని, వెలిగించిన దీపాలను తీరంలో సురక్షిత ప్రదేశంలో ఉంచాలని, పూజా సామగ్రి తెచ్చిన కవర్లు, పాల ప్యాకెట్లు, ఖాళీ బాటిళ్లు తదితర వ్యర్థాలను నీటిలో పడేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్తబుట్టల్లో వేయాలని కోరుతున్నారు. సద్దులు, వాయినాలు పంచుకున్న అనంతరం ప్లాస్టిక్ గ్లాసులు, అరటి తొక్కలు, విస్తరాకులు పూల వ్యర్థాలను తొలగించే గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు గోదావరి నది, వాగులు, చెరువుల పరిశుభ్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతగా మెలగాలని మండల ప్రజలను కోరారు.

# కరెంటు కోత వరి పంటకు మరణ శాసనం

పినపాకలో ఎండుతున్న వరి
అన్నదాతను ఆదుకోండి ఎమ్మెల్యే పాయం సార్..
15 రోజులు కరెంట్ ఇవ్వండి చాలు
చేతికొచ్చిన పంట చేజారిపోతుందని అన్నదాత ఆవేదన..
పినపాక మండలంలో 8 గంటలకే పరిమితమైన త్రీ ఫేస్..
ఎండుతున్న వరి చేలు
ఎమ్మెల్యే పాయం సార్.. మీరే దిక్కంటూ రైతన్నల వేడుకోలు

**అగ్నిధార న్యూస్ పినపాక , అక్టోబర్ 08:**

ఆరుగాలం కష్టించి, అప్పులు చేసి, మందుల ధరలు భరించి చేతికి అంది వచ్చిందనుకున్న పంట నేడు కళ్లముందే ఎండిపోతుంటే ఆ రైతన్న గుండె పగులుతుంది. పినపాక లో నేడు అదే పరిస్థితి నెలకొంది.ప్రస్తుతం వరి అత్యంత కీలకమైన చిరు పొట్ట దశలో ఉంది. ఈ 15 రోజులు వరికి ప్రాణం పోసి రైతుకు అన్నం పెట్టే రోజులు. గింజ తాలు కాకుండా గట్టిపడాలంటే పొలంలో నీరు నిలవాలి. కానీ పినపాక రైతుకు ఆ నీరు అందడం లేదు. కారణం..

**విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం.**

ప్రభుత్వం పేరుకు 12 గంటల ఉచిత త్రీ ఫేస్ కరెంటు ఇస్తున్నట్లు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో అమలవుతున్నది 8 గంటలే. అది కూడా లో వోల్టేజ్ తో, ఎప్పుడు పోతుందో



తెలియని పరిస్థితి. భూగర్భంలో నీళ్లున్నా.. మోటార్లు తిప్పడానికి కరెంటు లేక రైతు నిస్సహాయంగా చూస్తున్నాడు. ప్రకృతి ఈ ఏడాది కరుణించి వర్షాలు ఇచ్చినా, కరెంట్ అధికారుల వైఫల్యంతో రైతు ఓడిపోయే పరిస్థితి వచ్చింది. ఈ ఏడాది పెట్టుబడి రెండింతలు అయింది. విత్తనం, ఎరువులు, పురుగు మందుల ధరలు ఆకాశాన్ని అంటాయి. ఇప్పుడు నీరు పెట్టలేక పంట ఎండిపోతే ఆ అప్పు తీర్చలేక బతుకు భారంగా మారుతుంది. అన్నదాత ఇంట్లో పస్తులే మిగులుతాయి.

**- పినపాక రైతాంగం ఒక్కటే కోరుతోంది..**

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సార్.. మీరు రైతు బిడ్డ.. మా కష్టం మీకు తెలుసు. ఈ కష్టకాలంలో మమ్మల్ని ఆదుకోండి. మాకు శాశ్వతంగా వద్దు, ఈ చిరు పొట్ట దశ దాటే వరకు.. ఈ 15 రోజులు మాత్రం 18 గంటల కరెంటు వచ్చేలా అధికారులపై ఒత్తిడి తీసుకురండి. మీరు చొరవ తీసుకుంటేనే మా పంట నిలుస్తుంది, మా కుటుంబాలు నిలబడతాయి."అధికారులు వెంటనే స్పందించి, త్రీ ఫేస్ కరెంటును పూర్తి స్థాయిలో ఇవ్వకపోతే చేతికంది వచ్చిన వేల ఎకరాల వరి పంట నష్టపోవడం ఖాయం. ఇప్పటికైనా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు జోక్యం చేసుకొని రైతు కన్నీళ్లు తుడవాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

# గజ్వేల్ లో కదం తొక్కిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

రాహుల్ గాంధీ ఆందోళనతో బిజెపిలో వణుకు పుట్టింది
డిసిసి అధ్యక్షురాలు తూశీకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ
ప్రధాని మోడీ, సిఇసి, బిజెపికి వ్యతిరేకంగా నినాదాలు

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

ఓటు చోరికి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ చేపట్టిన ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ బ్లాక్ డే లో భాగంగా గురువారం సాయంత్రం సిద్దిపేట డిసిసి అధ్యక్షురాలు తూశీకుంట అంక్షారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్, బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నినాదాలు చేశారు. అనంతరం అంక్షా రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీకి సీఈసీ జ్ఞానేశ్వర్ కుమార్ తొత్తుగా మారినట్లు విమర్శించారు. దేశంలో అక్రమ పద్ధతుల్లో తిరిగి అధికారం చేపట్టేందుకే




ఎన్నికల కమిషన్ ను కీలుబొమ్మలా వాడుకుంటుండగా, అది ఎంత మాత్రం సాగబోదని హెచ్చరించారు. ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీల ఆందోళనను అడ్డుకోవడం సిగ్గుచేటు కాగా, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అపహస్యం చేస్తూ దేశాన్ని, దేశ ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీల పోరుతో కేంద్రంలోని బిజెపి సర్కార్ కు వణుకు పుట్టిందని, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ప్రధాని నరేంద్ర మోడీని గద్దె దించే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సుఖేందర్ రెడ్డి. పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, కౌన్సిలర్లు విష్ణువర్ధన్ రెడ్డి, రమేష్, గుంటుకు శీను మాజీమైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ సమీర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వహీద్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు జహీర్, అంజి యాదవ్, గుంటుకు శ్రీనివాస్, సారిక శ్రీనివాస్ రెడ్డి, చెప్యాల శేఖర్, జహంగీర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రద్దీప్రాంతాలు గుర్తించాలి.. రక్షణ చర్యలు చేపట్టాలి...

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
పెద్దపల్లి పట్టణంలోని అన్ని జంక్షన్లను సమగ్రంగా అధ్యయనం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలి
వన్‌వే, టూ-వే విధానాలను ప్రయోగాత్మకంగా అమలు చేసి ఫలితాలను పరిశీలించాలి.
ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను నిబంధనల ప్రకారం అమలు చేయాలి.
రోడ్ల పై పశువుల సంచారాన్ని నియంత్రించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి.
ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్.

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, అక్టోబర్-08:**

పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అన్ని జంక్షన్లను సమగ్రంగా అధ్యయనం చేసి, అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.

గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో డీసీపీ రామ్‌రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, పెద్దపల్లి పట్టణంలోని అన్ని ప్రధాన జంక్షన్లను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీకి గల కారణాలను గుర్తించి, రద్దీ



నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వన్‌వే, టూ-వే విధానాలను పరిశీలించి, నిబంధనల ప్రకారం ప్రయోగాత్మకంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ మార్పులను కనీసం ఒక వారం పాటు పరిశీలించి, ట్రాఫిక్ రాకపోకలపై వాటి ప్రభావం, ఫలితాలను అధ్యయనం చేసిన అనంతరం తగిన నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్ ప్రణాళికలను నిబంధనల ప్రకారం రూపొందించి, అవసరమైన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణలో పోలీసు, మున్సిపల్, రోడ్లు భవనాల శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్లపై ఆవులు, గేదెలు, ఇతర పశువులు సంచరించడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, వాటిని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పశువులను రోడ్లపైకి తీసుకురాకుం డా స్థానిక సంస్థల అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన మార్పులు, మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి రూపొందించే ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి అమలు వల్ల వచ్చే ఫలితాలను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమీక్షలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, ఆర్ అండ్ బి ఈ ఈ భావ్ సింగ్,ట్రాఫిక్ పోలీసు అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ ధర్నా

**అగ్ని ధార న్యూస్ ,(మందమర్రి) :** ఓటర్ల జాబితా నుంచి ఓట్ల తొలగింపు ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మందమర్రి పాత బస్టాండ్ ఫ్లైఓవర్ కింద భారీ ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. గడ్డం వివేక్ వెంకటస్వామి పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని నిరసన తెలిపారు. ఓట్ల తొలగింపులో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో చెన్నూరు




నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ సర్పంచులు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, పట్టణ కాంగ్రెస్, యూత్,



మహిళా, మైనారిటీ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్పీ చేతుల మీదుగా కఠిన సేవ పథకం అందుకున్న సీఐ వెంకటేశ్వర్లు



**అగ్నిధార న్యూస్:పినపాక ( భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)**

పినపాక మండలం ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు కఠిన సేవ పథకాన్ని అందుకున్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా సీఐ వెంకటేశ్వర్లు ఈ పథకాన్ని స్వీకరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ, పోలీస్ శాఖకు అందించిన సేవలను గుర్తిస్తూ ఈ పథకాన్ని అందజేశారు. కఠిన పరిస్థితుల్లోనూ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో సీఐ వెంకటేశ్వర్లు కీలకంగా వ్యవహరించారని ఎస్పీ కొనియాడారు. పోలీస్ శాఖలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సీఐ వెంకటేశ్వర్లును అభినందించారు. ఉన్నతాధికారుల నుంచి గుర్తింపు పొందడం పట్ల సీఐ వెంకటేశ్వర్లు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని సీఐ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలిపారు.

## రోడ్డును కప్పేస్తున్న ముళ్ళ పొదల తొలగింపు



**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని సిద్దిపల్లె కు వెళ్లే ప్రధాన దారిలో స్ట్రీట్ లైట్ల వెలుతురుకు అడ్డుగా, రోడ్డును కప్పేస్తూ ఉన్న ముళ్లపొదలను, ఉన్న చెట్లను గురువారం తొలగించారు. చెట్ల కొమ్మలు, పొదల కారణంగా రహదారిపై వెలుతురు సరిగా పడక పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామ సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ చొరవ తీసుకుని రహదారికి అడ్డుగా ఉన్న చెట్లను తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో రాత్రివేళల్లో స్ట్రీట్ లైట్ల వెలుతురు రహదారిపై స్పష్టంగా పడే అవకాశం ఏర్పడింది. ప్రమాదాల నివారణతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సర్పంచ్ స్పందించి చర్యలు చేపట్టడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎల్ ఓ సి మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ల



**రూ.75 వేల ఎల్ ఓ సి అందజేత**

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గం కమాన్ పూర్ మండలం కమాన్ పూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి కొమురమ్మ రూ.75,000 ఎల్ ఓ సి మంజూరు చేయించారు

కొత్తపల్లి కొమురమ్మ మోకాలికి చికిత్స కు సంబంధించి హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చుల నిమిత్తం సహాయం కొరకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరగా, వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.75 వేల ఎల్ ఓ సి మంజూరు చేయించారు.మంజూరైన ఎల్ ఓ సి పత్రాన్ని మంత్రి శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కొత్తపల్లి కొమురమ్మ కుటుంబ సభ్యులకు అందజేశారు.

## మృతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహాయం

**అగ్ని ధార న్యూస్ కల్వకుర్తి**

కల్వకుర్తి మండలంలోని తిమ్మారాసిపల్లి గ్రామానికి చెందిన చీముల పుల్లారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు ఉప్పల వెంకటేష్ తరఫున తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తుప్పల సిరియల్, శ్రీరామ్, కనికళ్ల కుమార్, పానగంటి పరశురాములు, ముచ్చింత మాధవులు, చీముల వెంకటరెడ్డి, తీర్పత్ రెడ్డి, జజాల హుస్సేన్, పంచర్ షాప్ అంజి తదితరులు పాల్గొన్నారు.

## 2030 నాటికి టీ బీ రహిత దేశంగా మార్చాలి ఎమ్మెల్యే గండ్ర.

**జయశంకర్ భూపాలపల్లి.** 2030 నాటికి దేశాన్ని టీబీ రహితంగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీబీ రహిత గ్రామ పంచాయతీల సన్మానం, జోష్ బృందాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు..





**ప్రాచీన త్రికోట శివాలయ మరమ్మతు పనులకు శంకుస్థాపన**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు, ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందుతున్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం మాడుగుల మండలం బంధువుల గ్రామపంచాయతీ పరిధిలోని 13వ శతాబ్దానికి చెందిన ప్రాచీన త్రికోట శివాలయం మరమ్మతు పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయాన్ని పరిరక్షించడంతో పాటు, అవసరమైన మరమ్మతు పనులను చేపట్టడం ద్వారా ఆలయ ప్రాశస్త్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రాచీన ఆలయ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేయడం పట్ల గ్రామస్థులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయాన్ని పరిరక్షించేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి గ్రామస్థులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సూదిని కొండల్‌రెడ్డి, జగన్ గౌడ్, సోదిని శ్రీనివాస్‌రెడ్డి, యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, సర్పంచులు లక్ష్య కొండ తిరుపతిరెడ్డి, మారి రెడ్డి, సాయికుమార్‌రెడ్డి, యాదయ్య గౌడ్, మిద్దె రాములు, జిల్లా రమేష్ గౌడ్, గుండె వెంకటేష్ గౌడ్, శివకుమార్ గౌడ్, భాస్కర్, వెంకటేష్, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**



కల్వకుర్తి పట్టణంలోని కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం దసరా పండుగను పురస్కరించుకుని బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి అధ్యక్షతన మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు వివిధ రకాల రంగురంగుల పూలతో తీరొక్కగా బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మల మధ్యలో గౌరీమాతను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి మాట్లాడుతూ, "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ సాగే బతుకమ్మ పాటల్లో మహిళల కష్టసుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు, భక్తి వంటి అనేక భావాలు ప్రతిబింబిస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం బతుకమ్మ పండుగకు మరింత ప్రాచుర్యం లభించిందని తెలిపారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పూల పండుగ అని, తెలంగాణ ప్రజలు బతుకమ్మను తమ ఇంటి దేవతగా భావించి భక్తిశ్రద్ధలతో పూజిస్తారని పేర్కొన్నారు. బతుకమ్మ పాటల్లో చరిత్ర, పురాణాలు, జానపద సంప్రదాయాలు మేళవించి ఉంటాయని, అవి ఎంతో వినసొంపుగా ఉంటాయని తెలిపారు. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాలను బతుకమ్మ పండుగ ప్రతిబింబిస్తుందని అన్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు, విద్యార్థినులు సామూహికంగా వేడుకలు నిర్వహించడం ద్వారా ఐక్యత, సోదరభావం, సాంస్కృతిక వారసత్వం ప్రతిబింబిస్తాయని తెలిపారు. ప్రకృతి, పూలతో మనిషికి ఉన్న అనుబంధాన్ని చాటిచెప్పే విశిష్టమైన పండుగ బతుకమ్మ అని అన్నారు. సద్దుల బతుకమ్మతో పండుగ ముగుస్తుందని వివరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి బతుకమ్మలను ఎర్రకుంటలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ గౌడ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ రాజు, ఐక్యూఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీమతిబాయి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఉప్పల వెంకటేష్..

**అగ్ని ధార న్యూస్ -- కల్వకుర్తి**

కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అనునిత్యం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయకుడిగా ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ప్రజల మన్ననలు పొందుతున్నారని ఆయన అభిమానులు, అనుచరులు పేర్కొంటున్నారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, విద్యార్థుల విద్యకు చేయూతనివ్వడం, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం వంటి పలు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారని వారు తెలిపారు. ప్రజా సమస్యలను తెలుసుకుని, తమ వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటున్నారని పేర్కొన్నారు. కేవలం పదవులు, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజలకు అండగా నిలవడమే లక్ష్యంగా ఉప్పల వెంకటేష్ పనిచేస్తున్నారని అభిమానులు చెబుతున్నారు. ముఖ్యంగా పేదలు, విద్యార్థులు, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆయన అందిస్తున్న సహకారం పట్ల ప్రజల్లో సానుకూల స్పందన వ్యక్తమవుతోందని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గానికి ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని, ప్రజల సమస్యలను దగ్గరుండి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసే ఉప్పల వెంకటేష్ వంటి నాయకుడు ఎమ్మెల్యేగా రావాలని పలువురు ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అభిమానులు పేర్కొన్నారు.

ప్రజల కష్టాల్లో తోడుగా.. నిరుపేదల కన్నీటిలో అండగా..

విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలుస్తున్న ఉప్పల వెంకటేష్ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని, ఆయన నాయకత్వంలో కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధి దిశగా



ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అభిమానులు, కార్యకర్తలు ఉప్పల వెంకటేష్ నాయకత్వం కోరుకుంటున్నారు.

# ప్రమాదకరంగా మారిన పాలన

**గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో నేటి జెన్ జీ లంతా జంతర్ మంతర్ లను సృష్టించాలి.**

**వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తీగల జీవన్ కుమార్.**

**పి.డి.ఎస్.యు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభం.**

**అగ్నిధారన్యూస్ హనుమకొండ**






దేశంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్, ఈడి, సిబిఐ, న్యాయవ్యవస్థ లాంటి రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, దేశ ప్రజల ఐక్యతకు, ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థ మనుగడకు ప్రమాదకరంగా మారిందని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు తీగల జీవన్ కుమార్ అన్నారు.

గురువారం హన్మకొండలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు కామ్రేడ్ దుస్సా చేరాలు నగర్ (శ్రీ శార్వాణి డిగ్రీ కాలేజ్) ప్రారంభమయ్యాయి.

ఈ క్లాసులను తీగల జీవన్ కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ దేశంలో పెట్రేగిపోతున్న మోడీ ప్రభుత్వ అరాచకాలను, మతోన్మాద ఫాసిస్టు విధానాలను నేటి విద్యార్థి ,యువత ప్రతిఘటించాలని, అవసరమైతే గ్రామాల్లో, పట్టణాల్లో జెన్ జీ లంతా ఢిల్లీ తరహా జంతర్ మంతర్ లను సృష్టించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులంతా శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోని, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

**"మార్క్స్ -భగత్ సింగ్ ల జీవితాలు-పరిచయం"**

అనే క్లాస్ ను పి.డి.ఎస్.యు.జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కొత్త పల్లి రవి బోధించారు. "నిర్మాణం-పని విధానం"అనే క్లాస్ పి.డి.ఎస్.యు.తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటీ పృథ్వీ బోధించారు.

క్లాసుల ప్రారంభానికి ముందు పి.డి.ఎస్.యు. బిగిపిడికిలి జెండాను జిల్లా అధ్యక్షులు బోయినపల్లి అజయ్ ఆవిష్కరించగా, విద్యార్థి అమరవీరులను స్మరిస్తూ ప్రధాన కార్యదర్శి బి.నరసింహ రావు ప్రవేశ పెట్టిగా ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు.ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు పి.అనూష,డి.వినయ్, సహాయ కార్యదర్శులు అలువాల నరేష్,వంశీ, జిల్లా కోశాధికారి కె.సంగీత, జిల్లా నాయకులు కె.రాజు, వికాస్ కుమార్, సిద్ధార్థ్, విఘ్నేష్, స్టీవెన్, కార్తీక్,అజయ్, చరణ్,సాయి,పూజీత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## లాఠీఛార్జ్ ఖండించిన పెద్దపల్లి ఎంపీ



**కేంద్ర ప్రభుత్వంపై ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్ర ఆగ్రహం.**

**అగ్నిధారన్యూస్ న్యూఢిల్లీ**

గురువారం రోజునఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమంలో ఎంపీలు, ప్రజాప్రతినిధులు, మహిళా ఎంపీలపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు జంతర్ మంతర్‌కు వెళ్తున్న తమను అడ్డుకుని లాఠీఛార్జ్ చేయడం ఏంటని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు, మహిళలపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై ప్రశ్నలు లేవనెత్తుతున్నందుకే తమపై పోలీసుల బలప్రయోగం చేస్తున్నారని ఎంపీ ఆరోపించారు. శాంతియుతంగా నిరసన చేస్తుంటే లాఠీలతో కొట్టాల్సిన అవసరం ఏముందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 13 కోట్ల మంది ఓటర్ల ఓట్లు తొలగించబడ్డాయని, దొంగ ఓట్లు వేశారని ఎంపీ ఆరోపించారు. ఈ అంశాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఈసి జ్ఞానేష్ కుమార్‌కు కేటగిరీ భద్రత కల్పించడంపై ఎంపీ ప్రశ్నలు లేవనెత్తారు. ఎలాంటి భద్రత కల్పించినా తమ నిరసన కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్యానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు మా పోరాటం ఆగదనీ తేల్చిచెప్పారు. రోడ్డుపై శాంతియుతంగా ధర్నా చేస్తున్న వారిపై, మహిళలపై కూడా పోలీసుల బలప్రయోగం చేయడం సిగ్గుచేటని ఎంపీ వంశీకృష్ణ అన్నారు. అమిత్ షా .. 'బేటీ బచావో' అంటే ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామనీఓటు హక్కుప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని పెద్దపల్లి ఎంపీ స్పష్టం చేశారు.

## శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి చేయూత



**ఆలయ కమిటీకి 51 వేల విరాళం అందజేసిన సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలంలోని గౌరీపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పడకల్ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి నివాసానికి మర్యాదపూర్వకంగా వెళ్లి ఆమెను కలిసి ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులను శాలువాతో సన్మానించి, ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ నిర్మాణం, ప్రారంభోత్సవ ఏర్పాట్ల వివరాలను కమిటీ సభ్యులు ఆమెకు వివరించారు. అనంతరం ఆలయ నిర్మాణం మరియు ఇతర కార్యక్రమాలకు తనవంతు సహకారంగా సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి ఆలయ కమిటీకి రూ. 51,000 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేస్తూ అభినందించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని, అందరూ తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. నూతనంగా నిర్మించిన శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గౌరీపల్లి సర్పంచ్ కళ్యాణ్ నాయక్, మాజీ సర్పంచ్ నరేందర్ గౌడ్, ఉప సర్పంచ్ రమేష్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మేడిపల్లి మహిళా సంఘానికే రేషన్ దుకాణం ఇవ్వాలి

**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :**

రామగుండం నగరపాలక సంస్థ 1వ డివిజన్ మేడిపల్లి మహిళా సంఘానికే రేషన్ దుకాణం కేటాయించాలని కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ డిమాండ్ చేశారు. స్థానిక కార్పొరేటర్‌కు సమాచారం ఇవ్వకుండా రేషన్ దుకాణాన్ని పక్క డివిజన్‌కు కేటాయించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. మేడిపల్లి మహిళా సంఘానికి దుకాణం కేటాయిస్తే స్థానిక మహిళలకు ఉపాధి లభించడంతోపాటు డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అధికారులు తీసుకున్న నిర్ణయంతో స్థానిక మహిళా సంఘానికి అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్‌ఠాకూర్, సంబంధిత ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కేటాయింపును పునఃపరిశీలించాలని కోరారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**అగ్నిధార న్యూస్ ,(పెద్దపల్లి) :**

సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్‌లో ప్రి-ప్రైమరీ విద్యార్థులకు ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో రంగురంగుల బతుకమ్మలను తీసుకువచ్చి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పండుగ విశిష్టత, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పరమైన ప్రాధాన్యతను ఉపాధ్యాయులు వివరించారు. ప్రకృతిని, పూలను గౌరవించడం, మన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించాల్సిన ఆవశ్యకతను చిన్నారులకు తెలియజేశారు. ఆటపాటలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

# ఫ్లాష్.. ఫ్లాష్... సర్పంచ్, ఉపసర్పంచ్ లకు షోకాజ్ నోటీసు

**నిబంధనలకు విరుద్ధంగా అధికారాలు దుర్వినియోగం.**

**15 రోజుల్లో సంజాయిసి ఇవ్వాలి**

**షోకాజ్ నోటీస్ కు స్పందించకుంటే**

**పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 37(5) అమలు.**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, అక్టోబర్ 08:**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ధర్మారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ద్యాగేటి రాజేశ్వరి, ఉప సర్పంచ్ ఎలిగేటి మల్లేశం లకు పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం 7-10-2026 .. ఏ5/2303/2026 ద్వారా షోకాజ్ నోటీసు జారీ చేశారు. గ్రామానికి చెందిన మేడవేని తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరిపి నివేదిక సమర్పించారు.సర్పంచ్ గా ఎన్నికైనప్పటి నుండి గ్రామ పంచాయతీ రికార్డులు అసెస్మెంట్ రికార్డులు అప్డేట్ చేయకపోవడం, కొత్త ఇంటి అనుమతులు 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా సర్పంచ్, ఉప సర్పంచ్ లు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని నియమ నిబంధనలు పాటించకుండా, తమకు ఉన్న అధికారాలను దుర్వినియోగం చేసినట్లుగా కలెక్టర్ ఇచ్చిన షోకాజు నోటీసులో పేర్కొన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 37(5) ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేస్తూ 15 రోజుల్లోగా సంజాయిషీ సమర్పించాలని ఇరువురిని ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సంజాయిషీ ఇవ్వని యెడల అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయని నోటీసులో హెచ్చరించారు.




## అడవి భూముల్లో గిరిజనులపై దౌర్జన్యం ఆపాలి



**లస్మయ్యపై దాడి జరిగిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ చేయాలి**

**బాధ్యులైన అటవీ అధికారులపై ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద చర్యలు తీసుకోవాలి**

**సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ దుర్గం నగేష్**

**అగ్నిధార న్యూస్,(మంచిర్యాల) :**

తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల్లో జీవనోపాధి పొందుతున్న గిరిజనులను అటవీ భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ దుర్గం నగేష్ అన్నారు. కోటపల్లి మండలం కొత్తపల్లి రాజారాం ప్రాంతంలో పట్టు పురుగుల పెంపకం (సెరికల్చర్) చేసుకుంటున్న గిరిజనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్న సమయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు.

ఈ ఘటనలో గిరిజనుడైన చింతల లస్మయ్యపై అటవీ శాఖ సిబ్బంది దాడికి పాల్పడ్డారని ఆదివాసీలు ఆరోపిస్తున్నారని, దీంతో లస్మయ్య స్పృహతప్పి పడిపోవడంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆరోపణలు నిజమైతే ఇది అత్యంత తీవ్రమైన విషయమని, గిరిజనుల హక్కులు, గౌరవం, జీవనోపాధిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ యంత్రాంగంపై ఉందన్నారు.

### తరతరాల సాగుపై స్పష్టత ఏదీ?

తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూముల విషయంలో గిరిజనులు, అటవీ శాఖ మధ్య వివాదాలు ఉంటే వాటిని చట్టపరమైన ప్రక్రియ ద్వారా పరిష్కరించాల్సి ఉందని డాక్టర్ దుర్గం నగేష్ పేర్కొన్నారు. బలప్రయోగం, బెదిరింపులు, ఘర్షణలకు దారితీసే చర్యలు సమస్యకు పరిష్కారం కావన్నారు. అటవీ హక్కుల చట్టం, ఇతర వర్తించే నిబంధనల ప్రకారం గిరిజనుల హక్కులను పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లస్మయ్యపై దాడి జరిగిందన్న ఆరోపణలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలను పరిశీలించాలని కోరారు. ఆరోపణలు రుజువైతే బాధ్యులైన అధికారులపై కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.గిరిజనులపై దాడులు, వేధింపులు చోటుచేసుకోకుండా ప్రభుత్వం ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, గిరిజనుల సమస్యలను అధికారులు ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించాలని దుర్గం నగేష్ కోరారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు సమతా సైనిక దళ్ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

## రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలి



**అగ్నిధార న్యూస్ ,(కరీంనగర్) :**

రైతులకు నాణ్యమైన 24 గంటల ఉచిత విద్యుత్ అందించి ఎండిపోతున్న పంటలను కాపాడాలని టీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలం దత్తోజిపేటలో విద్యుత్ సరఫరా సరిగా లేక ఎండిపోతున్న వరి పంటలను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ అంతరాయాల వల్ల సాగునీరు అందక రైతులు నష్టపోతున్నారని అన్నారు. పంట నష్టాన్ని ప్రభుత్వం వెంటనే గుర్తించి పరిహారం అందించాలని కోరారు. వ్యవసాయానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని, సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మ్యాకల తిరుపతి, మ్యాక వినోద్, శ్రీరాముల రమేష్, చంటి శ్రీనివాస్, పుల్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకత్వానికి రుణపడి ఉంటా



**అగ్నిధార న్యూస్ ,(ముత్తారం) :**

తనను రాజకీయంగా ప్రోత్సహించిన ముత్తారం మండల బీఆర్ఎస్ నాయకత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని బీఆర్ఎస్ నాయకుడు ఊట్ల శ్రీను తెలిపారు. పేద దళిత కుటుంబం నుంచి వచ్చిన తనను ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సమయంలో గుర్తించి, రాజకీయంగా అవకాశాలు కల్పించి మంథని నియోజకవర్గ ప్రజలకు పరిచయం చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. దళిత వర్గానికి చెందిన వారు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకునే పరిస్థితులు ఉన్నప్పటికీ, ముత్తారం మండల బీఆర్ఎస్ నాయకత్వం తనకు అండగా నిలిచిందన్నారు. భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ముత్తారం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీ నాయకత్వం, పుట్ట మధు విజయానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు. తనకు రాజకీయంగా అవకాశం కల్పించిన నాయకుల రుణాన్ని భవిష్యత్తులో తీర్చుకుంటానని తెలిపారు.

## మహిళలు, బాలికల భద్రతపై షీ టీమ్స్ దృష్టి



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :**

మహిళలు, బాలికల భద్రతలో షీ టీమ్స్ కీలక పాత్ర పోషించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. గురువారం కమిషనరేట్లో షీ టీమ్స్, మహిళలు, పిల్లల రక్షణ, భరోసా కేంద్రాల సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళలను వేధించే ఆకతాయిలపై నిఘా ఉంచి, ఫిర్యాదులపై ఆధారాలు సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 12 నుంచి 18 ఏళ్ల బాలికలకు వేధింపులు, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, మంచి స్పర్శ--చెడు స్పర్శపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. బాధితులకు తక్షణ సహాయంతో పాటు కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పునరావాస సేవలు అందేలా శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫిర్యాదుల్లో నేరం ఉన్నట్లు తేలితే ముందుగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, సంబంధిత అధికారులు, షీ టీమ్ సిబ్బంది, భరోసా కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు బీజేపీ సన్మానం



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్లో భాగంగా జనగామ మండలంలో పారిశుధ్య కార్మికులను బీజేపీ శ్రేణులు సన్మానించారు. బీజేపీ లేబర్ సెల్ జిల్లా కన్వీనర్ తడగొండ నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల కాళ్లు కడిగి గౌరవించి, వారితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పారిశుధ్య కార్మికులు ఎండ, వాన, చలి లెక్కచేయకుండా ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం అందిస్తున్న సేవలు అభినందనీయమని సంధ్యారాణి అన్నారు. శ్రమించే చేతులకు గౌరవం ఇవ్వడమే నిజమైన సేవ అని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు మరింత దృష్టి సారించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికులకు రూ.25 వేల లాభాల వాటా ఇవ్వాలి



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :**

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా కింద రూ.25 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆర్జీ-1 అధ్యక్షుడు ఎం.ఎ.గౌస్ డిమాండ్ చేశారు. గురువారం జీడీకే-1 సీహెచ్పీలో జరిగిన కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులు వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని, సంస్థ లాభాల్లో వారి శ్రమ కీలకమని తెలిపారు. గతంలో లాభాల నుంచి రూ.5 వేలు, రూ.5,500 చొప్పున ఇప్పించినట్లు పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు పని ప్రదేశాల్లో భద్రతా సామగ్రి అందించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించాలని కోరారు. సమావేశంలో కాంట్రాక్టు కార్మికులు వెంకన్న, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు సురక్షిత పని వాతావరణం




**అగ్నిధార న్యూస్ ,(రామగుండం) :** కార్యాలయాల్లో మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించడమే లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. గురువారం కమిషనరేట్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసీసీ) పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నివారణకు పోష్ చట్టం-2013ను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. మహిళలు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ఫిర్యాదు చేసేలా విశ్వసనీయ వాతావరణం కల్పించాలన్నారు. ఫిర్యాదులను నిబంధనల మేరకు విచారించి నిర్ణీత గడువులో నివేదికలు సమర్పించాలని, ఫిర్యాదుదారు, ప్రతివాది, సాక్షుల వివరాల గోప్యతను కాపాడాలని ఆదేశించారు. ఐసీసీ వివరాలు, ఫిర్యాదు విధానాన్ని నోటీసు బోర్డుల్లో ప్రదర్శించాలని, సిబ్బందికి పోష్ చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో అదనపు డీసీపీ కె.శ్రీనివాస్, సంబంధిత అధికారులు, ఐసీసీ సభ్యులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి కి పాలించే నైతిక హక్కు లేదు?

**జగదేవపూర్ సబ్ స్టేషన్ వద్ద నిరసన**
**ఆనాడు రైతులు కరెంట్ అడిగితే రైతుల మీద లాఠీ ఛార్జ్ చేసిన**
**ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది కదా**
**గజ్వేల్ బి ఆర్ ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట**

జిల్లా జగదేవపూర్ మండల కేంద్రశీలోని స్థానిక సబ్ స్టేషన్ వద్ద బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యతిధిగా గజ్వేల్ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్బంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇరవై నాలుగు గంటల కరెంట్ ఇచ్చిన దాకలలు, ఇచ్చిన రోజు లేదని అన్నారు. అదేవిధంగా నుండి చంద్రబాబు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇప్పుడు రేవంత్ రెడ్డి దాకా 24 గంటల కరెంట్ ఇచ్చిన రోజు లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ లో ఎవరు సీఎం గా వచ్చిన 24గంటల కరెంట్ ఇచ్చిన దాకలలు లెవ్వని తెలిపారు. అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు కరెంట్ అడిగితే రైతుల మీది లాఠీ ఛార్జ్ చేసింది మీరు కదా అన్నారు.



తెలంగాణ రాష్ట్రం కోసం కెసిఆర్ రాజీనామా చేసి రాష్ట్రం వస్తే కడుపు నిండా అన్నం పెట్టె రైతులకు 24గంటల కరెంట్ కష్టాలు పోతాయని కెసిఆర్ అన్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం కెసిఆర్ నిరాహార దీక్ష చేసిండని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలు దాపరిచాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే కరెంటు కష్టాలు పోతాయని కేసీఆర్ అన్నారని అన్నారు. కొత్తగూడెం 8 మెగావాట్లు భద్రాద్రి ఒక వెయ్యి 80 మెగావాట్లు రాష్ట్రంలో మొత్తం 19 వేల 400 వందల మెగావాట్ల విద్యుత్ కేసీఆర్ తీసుకువచ్చారని అన్నారు. ఆరోజు కరెంటు ఉంటే వార్త ఈరోజు కరెంటు పోతే వార్త అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాచామల్ల ఉపేందర్ రెడ్డి మండల ఉద్యమకారుల అధ్యక్షులు ఆలేటి లోలాకర్ రెడ్డి జంబల శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ అంకిల యాదవ రెడ్డి బట్టు సుధాకర్ మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్ కామల్ల భూమయ్య సర్పంచులు రాచమల్ల ఎల్లేష్ చెక్కల పరమేశ్వర్ క్యాసారం కుమార్ పరశు రాం ఉప సర్పంచ్ మచ్చ గణేష్ మాజీ ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు మండల ఉపసర్పంచల్ ఫోరం అధ్యక్షులు స్వామి కంచర్ల స్వామి దాచారం కనకయ్య నాయకులు రొయ్యల కర్ణాకర్ బేరస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి





అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు.

**అగ్నిధార పెద్దపల్లి, అక్టోబర్ 08 :**

టీబీ వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేస్తూ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎంపికైన 80 టీబీ ముక్త్ గ్రామాలకు సర్టిఫికెట్లను అదనపు కలెక్టర్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా వ్యాప్తిని అరికట్టవచ్చున్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రివేళల్లో చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారిని క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే పరీక్షలు నిర్వహించాలని వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. టీబీ నిర్ధారణ అయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు, మందులు సకాలంలో అందేలా చూడాలని, రోగులు చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా పూర్తిస్థాయిలో మందులు వినియోగించేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. 80 గ్రామాలు టీబీ ముక్త్ గ్రామాలుగా ఎంపిక కావడం అభినందనీయమని, ఈ స్ఫూర్తితో మిగిలిన గ్రామాలను కూడా టీబీ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ఆశా, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధుల సమన్వయంతో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. వై.పవిత్ర, జిల్లా టీబీ నియంత్రణ అధికారి కె.వి.సుధాకర్ రెడ్డి, రాష్ట్ర రెడ్ క్రాస్ సభ్యులు రాజగోపాల్, వివిధ మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, టీబీ రహిత గ్రామాల సర్పంచులు, పాల్గొన్నారు.

## చలాన్‌ఫైన్ తేడాలపై 16 మంది
## కోర్టు కానిస్టేబుల్స్‌కు మెమోలు, సస్పెండ్

**చలాన్లలో తేడాలపై సీపీ సీరియస్**

**రామగుండం** : కోర్టు కానిస్టేబుల్స్‌కు సస్పెండ్, మెమోలు మంచిర్యాల జిల్లాకు చెందిన కొంతమంది కోర్టు కానిస్టేబుల్స్ పై జనవరి 2024 నుండి జూన్ 2026 వరకు పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో చలాన్,ఫైన్ విషయంలో ఆన్లైన్ ఆఫ్లైన్లో బారీ తేడాల నేపథ్యంలో రామగుండం సిపి 16 మంది కోర్టు కానిస్టేబుల్స్ కు కొందరి మెమో జారీ చేయ్యగా మరి కొందరిని సస్పెండ్ చేసినట్లు సమాచారం.

## డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం:

**మేయర్ కొలగాని శ్రీనివాస్**

**కరీంనగర్** : కరీంనగర్ నగర ప్రజలకు సమస్యగా మారిన డంపింగ్ యార్డు సమస్యకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని మేయర్ కొలగాని శ్రీనివాస్ తెలిపారు. గురువారం 52వ డివిజన్‌లో పర్యటించిన ఆయన, క్రిస్టియన్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ సరిల్ల రాజకుమారి ప్రసాద్‌తో కలిసి రూ.24 లక్షల ఎస్ యుడిఎనిధులతో చేపట్టనున్న ఎస్ డబ్ల్యూజి డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. డంపింగ్ యార్డు ప్రక్షాళనకు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా రూ.17 కోట్లు కేటాయించి, టెండర్ ప్రక్రియ పూర్తి చేసి ఈఎన్ సి అనుమతులు పొందినట్లు మేయర్ తెలిపారు. త్వరలో బయోమైనింగ్ పనులు ప్రారంభిస్తామని, యుసిఎఫ్ పథకం కింద మరో రూ.80 కోట్ల ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. 52వ డివిజన్ అభివృద్ధికి యుఐడిఎఫ్ కింద రూ.1 కోటి కేటాయించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. నగరంలో బతుకమ్మ, దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత మండప కర్ర పూజ

**ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన యాదగిరి సునీల్ రావు**

**కరీంనగర్ :** కరీంనగర్ సిటీ కాశ్మీర్ గడ్డ ప్రాంతంలోని ఫండస్ స్కూల్ కూడలిలో గణేష్ యూత్ మాజీ కార్పొరేటర్ టి.శ్రీదేవి- చంద్రమౌళి ఆధ్వర్యంలో దేవి నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రతిష్టించనున్న దుర్గామాత మండప నిర్మాణ పనులకు కర్ర పూజ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలతో కర్ర పూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫండస్ స్కూల్ యాజమాన్యం ప్రభాకర్ రెడ్డి, గణేష్ యూత్ ప్రతినిధులు శ్రీరామ్, రూపేష్, ఐలేని రాజశేఖర్ రెడ్డి, భాస్కర్, సంటి అశోక్, స్థానిక నాయకులు, మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## క్షయ రహిత సమాజం అందరి లక్ష్యం

**జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్**

**మహబూబాబాద్ :** క్షయ రహిత సమాజమే అందరి లక్ష్యమని జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్జున్ అన్నారు. టీబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐ డి ఓ సి కార్యాలయంలో ని కాన్ఫరెన్స్ హాలులో అన్ని మండలాల ఎంపీడీవోలతో కలిసి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డ ఆవిష్కరించిన జోష్ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొన్నారు.

## గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ
## కళాశాలలో ఎయిడ్స్ పై అవగాహన




**అగ్నిధారన్యూస్ గోదావరిఖని08**

తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశానుసారంమాస్ కాంపెయిన్ లో భాగం గా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోదావరిఖని రెడ్ రిబ్బన్ క్లబ్, స్పోర్ట్స్ క్లబ్, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ ల సంయుక్త ఆధ్వర్యం లో ఎయిడ్స్ మీద అవగాహన కలిగించే ఉద్దేశ్యం తో మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విజేతలైన విద్యార్థులకు మొదటి బహుమతి కింద జీభరత్ కి 1000 రూపాయలు, రెండవ బహుమతి కింద ఈశ్వర్ కి 500 రూపాయల నగదు బహుమతి ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొని విజేతలు గా గెలిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆచార్య జై కిషన్ ఓఝా ప్రత్యేకం గా అభినందించారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ సాంబ శివ రావు, డా.సుబ్బారావు, డా.నరేష్, డా. అజయ్ కుమార్, డా. కిరణ్మయి,డా.సతీష్ మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## కాఫీ లైజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి**
**అక్టోబర్ 23 నుంచి నిరవధిక సమ్మెకు నోటీసు**

**పాడేరు :** పాడేరు ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న కాఫీ లైజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించి, రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ అల్లూరి సీతారామరాజు జిల్లా సహాయ కార్యదర్శి లింగేరి సుందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 23 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మకు సమ్మె నోటీసు అందజేశారు. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో 2000 సంవత్సరం నుంచి 156 మంది కాఫీ లైజన్ కార్మికులు పనిచేస్తున్నారని సుందర్‌రావు తెలిపారు. కాఫీ ప్రాజెక్టు అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వారికి ప్రస్తుతం నెలకు కేవలం రూ.15 వేల వేతనం చెల్లించడం అన్యాయమన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల నేపథ్యంలో ఈ వేతనం కుటుంబాల కనీస అవసరాలకు కూడా సరిపోవడం లేదని పేర్కొన్నారు. నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి.- ప్రతి కార్మికుడికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి.- విధి నిర్వహణలో ప్రమాదం జరిగితే ప్రమాద బీమా కల్పించాలి.- కార్మికుడు విధి నిర్వహణలో మృతి చెందితే కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.- ప్రతి కార్మికుడికి నెలకు 10 లీటర్ల పెట్రోలు అందించాలి.- విధి నిర్వహణకు అవసరమైన రాత సామగ్రి ఖర్చులను ఐటీడీఏ భరించాలి.

## ఓటు హక్కు పరిరక్షణకు పోరాటం

**అగ్ని ధార న్యూస్,( కరీంనగర్) :**



దేశంలో ఓటర్ల జాబితా నుంచి లక్షలాది మంది ఓట్లు తొలగించారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు మేడి అంజయ్య అన్నారు. ఢిల్లీలో ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీలు చేస్తున్న పోరాటానికి ప్రజల మద్దతు ఉందన్నారు. ఆందోళనకారులపై పోలీసుల లాఠీచార్జిని ఖండించారు. దళితులు, బడుగు బలహీనవర్గాలు, ఎస్టీలు, మైనారిటీల ఓటు హక్కును కాపాడేందుకు ప్రజలు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కు పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజా, కుల సంఘాలు, అంబేద్కర్ సంఘాలు భాగస్వాములు కావాలని కోరారు.

## కాంట్రాక్టు కార్మికులకు రూ.25
## వేల దసరా అడ్వాన్స్ ఇవ్వాలి



**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం) :**

సింగరేణి పర్మినెంట్ కార్మికులకు రూ.1,10,250 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో కాంట్రాక్టు కార్మికులకు కూడా దసరా అడ్వాన్స్‌గా రూ.25 వేలు చెల్లించాలని తెలంగాణ కాంట్రాక్టు కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, నాయకులు ఎరుకల నాగరాజు, కమటం సందీప్, రామగిరి శ్రీనివాస్, బోయ రాజులు మాట్లాడుతూ.. కాంట్రాక్టు కార్మికులకు గతంలో ఇచ్చిన రూ.5,500కు బదులుగా సింగరేణి లాభాల వాటా నుంచి రూ.10 వేలు చెల్లించాలని కోరారు. పండుగ వేళ కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని, హైపవర్ కమిటీ వేతనాల అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు

## మేజిక్ రాజాకు జాతీయ అవార్డు

**'బెస్ట్ మైండ్ పవర్ మోటివేషనల్ స్పీకర్'గా సన్మానం**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**

మేజిక్, మిమిక్రీ, మైమ్, వెంట్రిలాక్విజం తదితర కళల్లో రాణిస్తున్న మేజిక్ రాజాకు జాతీయస్థాయి అవార్డు లభించింది. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నాంపల్లిలో నిర్వహించిన డాక్టర్ బీవీ పట్టాభిరామ్ స్మారక జాతీయ అవార్డ్స్--2026 కార్యక్రమంలో ఆయనకు 'బెస్ట్ మైండ్ పవర్ మోటివేషనల్ స్పీకర్' అవార్డును అందజేశారు. విద్యార్థులకు మెమరీ టెక్నిక్స్, రీడింగ్ స్కిల్స్, పాజిటివ్ థింకింగ్, లక్ష్య సాధన తదితర అంశాలపై మేజిక్ రాజా ప్రేరణాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎంఏ కరీం తెలిపారు. అనంతరం రాజా ప్రదర్శించిన 'మాట్లాడే బొమ్మ' సభికులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రా ముఖర్జీ, పలువురు వైద్యులు, సైకాలజిస్టులు, సీనియర్ మెజీషియన్లు పాల్గొన్నారు. జాతీయ అవార్డు అందుకున్న మేజిక్ రాజాను ఉమ్మడి కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్, స్థానిక కళాకారులు అభినందించారు.

## టీబి ముక్త్ ప్రశంసా పత్రం అందుకున్న పెంచికల్ పేట్ సర్పంచ్ పల్లె మాధవి

**అగ్నిధార న్యూస్ కమాన్ పూర్,**

కమాన్ పూర్ మండలంలోని పెంచికల్ పేట్ గ్రామం టిబి ముక్త్ గ్రామంగా ఎంపికైంది. బుధవారం రోజున అదనపు కలెక్టర్ శ్రీరాములు చేతులమీదుగా సర్పంచ్ పల్లె మాధవి నారాయణ, కమాన్ పూర్ ఎంపీడీవో సాదినేని ప్రియాంక ప్రశంస పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేసి టిబి రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ శ్రీరాములు కోరారు. ప్రతి సర్పంచ్ గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేసి టీబి నీ తరిమికొట్టాలని ప్రారంభ దశలోనే అరికట్టాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలు మందులు సకాలంలో తీసుకువెళ్లి వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సూది రెడ్డి ప్రవళిక పాల్గొన్నారు.



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com